మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 8-6-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 340 Issue: 340

08 జూన్ 2026 - సోమవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ(అధిక) మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:44 సూర్యాస్తమయం - సా. 6:45 తిథి అష్టమి తె. 3:21ం వరకు తరువాత నవమి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం శతభిష ఉ. 8:58 వరకు తరువాత పూర్వాభాద్ర యోగం విష్కంభ ఉ. 9:25 వరకు కరణం బాలవ మ. 3:24 వరకు కౌలవ తె. 3:21ం వరకు వర్జ్యం మ. 3:41 నుండి సా. 5:19 వరకు దుర్ముహూర్తం మ. 12:41 నుండి మ. 1:33 వరకు మ. 3:17 నుండి సా. 4:09 వరకు రాహుకాలం ఉ. 7:22 నుండి ఉ. 9:00 వరకు యమగండం ఉ. 10:37 నుండి మ. 12:15 వరకు గుళికాకాలం మ. 1:52 నుండి మ. 3:30 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:08 నుండి తె. 4:56 వరకు అమృత ఘడియలు రా. 1:28 నుండి తె. 3:06 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:49 నుండి మ. 12:41 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial

# ఏఐ దాహం.. తీరనిది!

## మనుషుల కంటే ఎక్కువ నీటి వినియోగం

**2030 నాటికి 130 కోట్ల మంది నీటిని తాగేస్తుంది.. ఏటా 2.5 మిలియన్ టన్నుల ఈ-వ్యర్థాలు**

కృత్రిమ మేధస్సు ప్రపంచాన్ని వేగంగా మార్చేస్తోంది. చాట్‌బాట్లు, చిత్రాల సృష్టి, వీడియో జనరేషన్, ఆటోమేషన్ వంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్న ఏఐ వెనుక ఒక భారీ పర్యావరణ వ్యయం దాగి ఉందని తాజాగా ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ హెచ్చరించింది. ఐక్యరాజ్యసమితి విశ్వవిద్యాలయం (యూఎన్‌యూ-ఐఎన్‌డబ్ల్యూఈహెచ్) విడుదల చేసిన నివేదిక ప్రకారం, 2030 నాటికి ఏఐ డేటా సెంటర్లు 945 టెరావాట్-గంటల విద్యుత్‌ను వినియోగించే ప్రమాదం ఉంది. 9.3 ట్రిలియన్ లీటర్ల నీటిని ఉపయోగించనుంది. 130 కోట్ల మంది ప్రజల వార్షిక గృహావసర నీటి అవసరాలకు సమానమైన నీటిని ఖర్చు చేయనుంది. 14,500 చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని ప్రభావితం చేస్తుందని, ఏటా 2.5 మిలియన్ టన్నుల ఈ-వ్యర్థాలను ఉత్పత్తి చేస్తుందని పేర్కొంది.



**2030 నాటికి ఏఐ ప్రభావం**

| అంశం | అంచనా |
|---|---|
| నీటి వినియోగం | 9.3 ట్రిలియన్ లీటర్లు |
| సమాన నీటి వినియోగం | 1.3 బిలియన్ మంది |
| విద్యుత్ వినియోగం | 945 టీడబ్ల్యూహెచ్ |
| భూభాగ ప్రభావం | 14,500 చదరపు కిలోమీటర్లు |
| ఈ-వ్యర్థాలు | 2.5 మిలియన్ టన్నులు/ఏటా |
| ఏఐ వాటా | సెంటర్ విద్యుత్ వినియోగంలో 40% వరకు |

జెనీవా: చాలామందికి ఏఐ అంటే కేవలం సాఫ్ట్‌వేర్ మాత్రమే అనిపిస్తుంది. కానీ వాస్తవానికి ఏఐ వెనుక లక్షలాది సర్వర్లు, చిప్‌లు, డేటా సెంటర్లు పనిచేస్తుంటాయి.నీటి వినియోగం ప్రధానంగా మూడు చోట్ల ఉంటుంది. 1. సర్వర్ల శీతలీకరణ. 2. విద్యుత్తు ఉత్పత్తి, 3. చిప్‌ల తయారీ. సర్వర్లు నిరంతరం వేడి ఉత్పత్తి చేస్తాయి, వాటిని చల్లబరచడానికి పెద్ద మొత్తంలో నీరు అవసరం అవుతుంది. ఏఐకి కావాల్సిన విద్యుత్‌ను ఉత్పత్తి చేసే థర్మల్, అణు విద్యుత్ కేంద్రాలు కూడా నీటిని వినియోగిస్తాయి. ఎన్విడియా, ఏఎండీ వంటి సంస్థలు అధునాతన ఏఐ చిప్‌ల ఉత్పత్తికి అత్యంత



# నేటి నుంచి చేప ప్రసాదం పంపిణీ

**హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు**

హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జూన్ 8, 9 తేదీల్లో ఉదయం 6 నుండి రాత్రి 8 గంటల వరకు చేప ప్రసాదాన్ని అందజేయనున్నారు. పంపిణీకి లక్షల మంది వచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ పోలీసులు పలు మళ్లింపులు, పార్కింగ్ ఆంక్షలు విధించారు.

నాంపల్లి-హైదరాబాద్, జూన్ 7 (ఈవార్తలు): ఎంజే మార్కెట్ నుండి వచ్చే సాధారణ ట్రాఫిక్‌ను అబిడ్స్, జీపీవో వైపునకు, అలాగే బేగం బజార్ నుండి వచ్చే వాహనాలను అలస్కా జంక్షన్ వద్ద దారుసలాం, ఏక్ మినార్ వైపునకు మళ్లిస్తారు. ఎంజే మార్కెట్ - తాజ్ ఐలాండ్ మధ్య భారీ వాహనాలకు అనుమతి లేదు, వీటిని ఏఆర్ పెట్రోల్ బంక్ మీదుగా మళ్లిస్తారు. నాంపల్లి వైపు నుండి వచ్చే కార్లను గృహ కల్ప, గగన్ విహార్, చంద్ర విహార్‌లలో పార్క్ చేసి గేట్ నంబర్ 2 ద్వారా నడుచుకుంటూ వెళ్ళాలి. ద్విచక్ర వాహనాల కోసం ఎంజే మార్కెట్ మార్గంలో మనోరంజన్ కాంప్లెక్స్, నాంపల్లి మార్గంలో షెజాన్ హోటల్ పక్కన గల తరువాయి 2 వ పేజీలో...



# పాఠశాలలు రీఓపెన్ జూన్ 15 నుంచి

## సెలవులను పొడగించిన విద్యాశాఖ

## జూలై 11న సాధారణ పని దినం

పాఠశాలల పునఃప్రారంభంపై రాష్ట్ర విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. 2026-27 విద్యా సంవత్సరానికి గానూ అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ముందుగా నిర్ణయించిన పాఠశాలల పునఃప్రారంభ తేదీని మారుస్తూ ప్రభుత్వం తాజాగా అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు జూన్ 12న కాకుండా జూన్ 15వ తేదీ (సోమవారం)న పునఃప్రారంభం కానున్నాయి. ఈ మేరకు తెలంగాణ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ కీలక ఆదేశాలు జారీ చేశారు.

హైదరాబాద్, జూన్ 7 (ఈవార్తలు): వాస్తవానికి వేసవి సెలవుల అనంతరం జూన్ 12న పాఠశాలలను తిరిగి తెరవాలని విద్యాశాఖ తొలుత షెడ్యూల్ ఖరారు చేసింది. అయితే క్యాలెండర్ ప్రకారం.. ఆ తర్వాతి రోజుల్లో అంటే జూన్ 13న రెండో శనివారం, జూన్ 14న ఆదివారం వచ్చాయి. కేవలం ఒకే ఒక్క రోజు జూన్ 12న స్కూళ్లు తెరిచి ఆ వెంటనే వరుసగా రెండు రోజులు సెలవులు రావడం సరైంది కాదని విద్యార్థుల తల్లిదండ్రులు భావించారు. ఈ నేపథ్యంలో రీఓపెనింగ్ తేదీని పునఃసమీక్షించాల్సిందిగా వివిధ ఉపాధ్యాయ సంఘాలు, తల్లిదండ్రుల నుంచి ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు అందాయి. ఈ అభ్యర్థనలను సానుకూలంగా పరిశీలించిన ప్రభుత్వం.. విద్యార్థులు, ఉపాధ్యాయుల సౌకర్యార్థం రీఓపెనింగ్ తేదీని తరువాయి 2 వ పేజీలో...

# కిషన్.. నిన్ను వదల



## మెట్రోను అడ్డుకుంటున్నరు

**ట్రిపుల్ ఆర్‌కు నిధులిస్తలేరు.. కేటీఆర్‌కు సాయం చేస్తున్నరు**

**కమలం నేతలే ఈ మాట అంటున్నరు.. సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు**

కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణ కోసం ప్రతిపాదనలు పంపిస్తే కేంద్ర ప్రభుత్వం ఆమోదించడం లేదని మండిపడ్డారు. కేంద్రమంత్రిగా ఉన్న ఓ నేత మెట్రో విస్తరణను ఢిల్లీలో అడ్డుకుంటున్నారని కిషన్ రెడ్డిని ఉద్దేశించి పరోక్షంగా తీవ్ర ఆరోపణలు చేశారు.

మేడ్చల్-మల్కాజిగిరి, జూన్ 7 (ఈవార్తలు): కిషన్‌రెడ్డి బీజేపీలోనే ఉండి.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సహాయం చేస్తారని కమలం పార్టీ నేతలే చెబుతున్నారని విమర్శించారు. ఇక తనను పార్టీలు మార్చే నేతగా ఆరోపణలు చేస్తున్న కిషన్‌రెడ్డిని విమర్శలు గుప్పించిన రేవంత్ రెడ్డి.. తాను ఏ పార్టీలో ఉన్నా.. ప్రజల కోసం పనిచేస్తానని తేల్చి చెప్పారు. ఇతర పార్టీల కోసం పనిచేయనని స్పష్టం చేశారు. మెట్రో విస్తరణకు కేంద్రం నుంచి ఎందుకు అనుమతులు రావడం లేదో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ ఉప్పల్ భగాయత్ వేదికగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన తర్వాత మాట్లాడిన రేవంత్ రెడ్డి.. ఎన్నికలు ఉన్నప్పుడే రాజకీయాలు చేయాలని తరువాయి 2 వ పేజీలో...



# రేవంత్‌కు స్ఫూర్తి హిట్లర్

## హంతక ఏజెన్సీ హైడ్రా.. కేటీఆర్ కౌంటర్

ప్రపంచ చరిత్రలోనే అత్యంత క్రూరమైన నియంతగా ముద్రపడిన అడాల్ఫ్ హిట్లర్ తనకు ఆదర్శమని, ఆయన కోర్ టీమ్ పేరు మీదుగానే హైడ్రా ఏర్పాటుచేశానని చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. 'మీకు స్ఫూర్తి హిట్లర్, మీ అసాసినేషన్ ఏజెన్సీ హైడ్రా.. మీరు నియంతలను ఆరాధిస్తూ గొప్పలు చెప్పుకుంటారు. ఈ విషయం తెలంగాణ ప్రజలకు ముందే తెలుసు. ఇప్పుడు దేశం మొత్తానికి స్పష్టత ఇచ్చినందుకు ధన్యవాదాలు' అని సెటైర్లు వేశారు.


హైదరాబాద్, జూన్ 7 (ఈవార్తలు): 'మేం మీ అంత తెలివైన వాళ్లం కాదు.. అందుకే మా పాలనకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగం, మహాత్మాగాంధీ ఆశయాలు, ప్రొఫెసర్ జయశంకర్ సార్ కలలను ఆదర్శంగా తీసుకున్నాం. నియంతృత్వ ఆలోచనలకు మేం వ్యతిరేకం, ప్రజాస్వామ్య విలువలే మాకు మార్గదర్శకాలు' అని ఆయన వ్యాఖ్యానించారు. బెంగళూరులో జాతీయ దినపత్రిక ది హిందూ శనివారం నిర్వహించిన కార్యక్రమంలో తనను తాను తాను హిట్లర్‌గా ప్రొజెక్ట్ చేసుకోవడానికి విఫలయత్నం చేసిన రేవంత్ రెడ్డి చివరకు జాతీయ మీడియా ఎదుట బొక్కబోర్లాపడ్డారు. హెచ్చులకు పోయి నెటిజన్ల చేతికి చిక్కి విపరీతంగా ట్రోల్స్‌కు గురవుతూ నవ్వులపాలయ్యారు. ఈ కార్యక్రమంలో తెలంగాణలో హైడ్రా ఏర్పాటుపై యాంకర్ ప్రశ్నించారు. దీనికి స్పందించిన రేవంత్.. జర్మనీ నియంత అడాల్ఫ్ హిట్లర్ స్ఫూర్తితో తాను హైడ్రాను తీసుకొచ్చినట్టు చెప్పారు. 'హైడ్రా అనేది హిట్లర్ ఫేవరేట్ పదం. హైడ్రా తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

**బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)**

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,273 |
| వెండి (కిలో): | రూ.2,70,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,440 |

## విశ్వవాణి



విజేత జ్వెరెవ్

పారిస్: జర్మనీ స్టార్ ప్లేయర్ జ్వెరెవ్ ఫ్రెంచ్ ఓపెన్ పురుషుల సింగిల్స్‌లో నయా చాంపియన్‌గా నిలిచాడు. ఆదివారం రాత్రి ఐదుసెట్ల పాటు అత్యంత ఉత్కంఠగా సాగిన తుదిపోరులో రెండో సీడ్ జ్వెరెవ్ 6-1, 4-6, 6-4, 6-7 (5/7), 6-1తో పదో సీడ్ ఇటలీ స్టార్ ఫ్లావియో కొబోలిపై అద్భుత విజయం సాధించాడు. 2020లో యూఎస్ ఓపెన్, 2024లో ఫ్రెంచ్ ఓపెన్, గతేడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్స్‌లో ఓడిన 29 ఏండ్ల జ్వెరెవ్ తన కెరీర్‌లో లోటుగా ఉన్న గ్రాండ్‌స్లామ్ ట్రోఫీని రోలాండ్ గారోస్‌లో అందుకున్నాడు.

# పవన్‌కు కిరీటం ఏం పెట్టలేదు!

## ప్రకాశ్ రాజ్ ట్వీట్‌పై ఆర్జీవీ రియాక్ట్



సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటారు. సినిమాలపైనే కాకుండా.. సామాజిక, రాజకీయ అంశాలపై తనదైన శైలిలో స్పందిస్తుంటారు. తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా వెల్లడిస్తూ, అప్పుడప్పుడు వివాదాలు కొనితెచ్చుకుంటారు. ముఖ్యంగా మెగా ఫ్యామిలీని ఉద్దేశిస్తూ గతంలో ఎక్స్ లో ఆయన పెట్టిన పోస్టులు పెద్ద దుమారమే రేపాయి. అయితే గత కొన్నాళ్లుగా సైలెంట్‌గా ఉన్న ఆర్జీవీ.. తాజాగా ప్రకాష్ రాజ్ పోస్టుపై స్పందించి వార్తాల్లో నిలిచారు.

హైదరాబాద్, జూన్ 7 (ఈవార్తలు): జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు ఇటీవల పెట్టిన పోస్ట్‌పై ప్రకాష్ రాజ్ ఫైర్ అయిన సంగతి తెలిసిందే. నాయకుడికి అన్నీ తెలుసని, ఆయన మాటే శాసనం అని నాగబాబు ట్విట్టర్ లో పోస్ట్ పెట్టారు. "లీడర్ మాటే శిరోధార్యం. ఆయన మార్గంలో ఉన్న దుష్టశక్తులను ఎవరూ చూడలేదు. ఏది సరైనదో, ఏది కాదో ఆయనకు మాత్రమే తెలుసు. మీ సందేహాలను పక్కనపెట్టి, మౌనం వహించి, ఎటువంటి ప్రశ్నలూ వేయకుండా నాయకుడిని అనుసరించండి" అని నాగబాబు పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ ప్రజల నాయకుడు అంటూ ఆయన ఫోటోని పోస్ట్ చేశారు. నాగబాబు ట్వీట్ పై నటుడు ప్రకాష్ రాజ్ ఘాటుగా స్పందించారు. 'మీ సందేహాలను పక్కనపెట్టండి, నోరు మూసుకొని ప్రశ్నలు వేయకుండా మౌనంగా నాయకుడిని అనుసరించండి' అని అనడంలో మీ ఉద్దేశ్యం తరువాయి 2 వ పేజీలో...



# మీ హెచ్చులు ఆపి.. లెక్కలు చెప్పండి!

**పవన్ కల్యాణ్‌కు రాహుల్ రామకృష్ణ సూటి ప్రశ్న**

నటుడు రాహుల్ రామకృష్ణ జనసేన చీఫ్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ప్రశ్నల బాణం ఎక్కుపెట్టారు. ' పవన్ కల్యాణ్ .. పెసా 1/70 చట్టం (ది పంచాయతీస్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్ ఏరియాస్ యాక్ట్), గ్రామ సభ చట్టం అమలుకు సంబంధించిన ఫలితాలను దయచేసి అడిగి చూపించండి' అంటూ ప్రశ్నించారు. అటవీ విస్తరణ కార్యక్రమాలు మీరు చేశారా? అని అడిగారు.

హైదరాబాద్, జూన్ 7 (ఈవార్తలు): ఒక స్వతంత్ర సంస్థ వెల్లడించిన లెక్కల ప్రకారం.. గణాంకాలు అనుమానాస్పదంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆ లెక్కల కోసం తాను దాఖలు చేసి.. వాటి ద్వారా వచ్చిన ఫలితాలను అడుగుతున్నట్లు చెప్పారు. చివర్లో జై తెలంగాణ అంటూ ట్వీట్ చేశారు. ఆ తర్వాత మరో ట్వీట్ చేసిన రాహుల్ రామకృష్ణ.. వీటితోపాటు మీరు సాధారణం గా చేసే ఆర్భాటాలు పక్కన పెడితే.. పవన్ కల్యాణ్ నిర్వహించే ప్రతీ పదవిలోని ప్రతీ విభాగంలో సమాచార హక్కు చట్టంలోని క్రియాశీల సమాచారాన్ని బహిర్గతం చేయడానికి సంబంధించిన సెక్షన్ 4.1(బి)ని అమలు చేశారా అని ప్రశ్నించారు. తాను పవన్ కల్యాణ్ అభిమానిని కాబట్టే అడుగుతున్నానని.. తాము అడిగే ప్రశ్నలకు నిరంతరం సమాధానం ఇవ్వాలని పవన్ కల్యాణ్‌కు సూచించారు.



# నేడు 'ఇండియా' భేటీ

## 23 పార్టీలు హాజరయ్యే చాన్స్

న్యూఢిల్లీ: వర్షాకాల పార్లమెంట్ సమావేశాలకు ముందు ఇండియా కూటమి భేటీకి సిద్ధమైంది. సోమవారం ( జూన్ 8)న ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరగనుంది. గత రెండు సమావేశాలు కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ నివాసాల్లో జరినప్పటికీ, రేపటి సమావేశానికి తటస్థ వేదికను ఎంచుకున్నారు. బెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలో టీఎంసీ, తమిళనాడులో స్టాలిన్ నేతృత్వంలో డీఎంకే ఓడిపోయిన తర్వాత ఈ భేటీ జరుగుతుండటంతో దీనికి ప్రాధాన్యం ఏర్పడింది. టీఎంసీ సంక్షోభం నేపథ్యంలో మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీలు ఈ తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు
8.6.2026

మేషం: గృహ నిర్మాణ ప్రయత్నాలు వాయిదా వేస్తారు. గృహమున కొన్ని సంఘటనలు మానసిక అశాంతి కలిగిస్తాయి. చేపట్టిన పనులలో ఆటంకాలు కలుగుతాయి. బంధువులతో విభేదాలు తప్పవు. వ్యాపార, ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది.

వృషభం: ఆర్థిక ఇబ్బందులు చికాకు పరుస్తాయి. నూతన ఋణయత్నాలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నయి. వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. కొన్ని ముఖ్యమైన పనులు వ్యయప్రయాసలతో పూర్తి అవుతాయి. ఉద్యోగ వాతావరణం గందరగోళంగా ఉంటుంది.

మిథునం: సంఘంలో కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. సన్నిహితుల నుంచి ధనలాభ సూచనలున్నవి. మిత్రులతో వివాదాల నుండి బయటపడతారు. ఆప్తుల నుండి విలువైన సమాచారం సేకరిస్తారు. వ్యాపార వ్యవహారాల్లో పురోగతి సాధిస్తారు. ఉద్యోగాలలో నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి.

కర్కాటకం: గృహమున ఆశ్చర్యకరమైన విషయాలు తెలుసుకుంటారు. దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు. వ్యాపార విస్తరణకు సన్నిహితుల సహాయ సహకారాలు అందుతాయి. సమాజంలో పరిచయాలు పెరుగుతాయి. ఉద్యోగులకు అదనపు బాధ్యతల నుండి ఉపశమనం లభిస్తుంది.

సింహం: ఇంటాబయట ఒత్తిడులు పెరుగుతాయి. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. వృత్తి వ్యాపారాలు నిరాశ కలిగిస్తాయి. ఆర్థిక ఇబ్బందుల వలన నూతన ఋణాలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. ఉద్యోగులకు స్థానచలన సూచనలున్నవి.

కన్య: బంధు మిత్రులతో ఊహించని మాట పట్టింపులుంటాయి. కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. ప్రయాణాల్లో అవరోధాలు కలుగుతాయి. వ్యాపార విషయంలో తొందరపాటు నిర్ణయాలు నిరాశ పరుస్తాయి. ఉద్యోగులకు పని ఒత్తిడులు పెరుగుతాయి.

తుల: విద్యార్థులు పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. సంఘంలో గౌరవ మర్యాదలకు లోటు ఉండదు. విలువైన వస్తులాభాలు పొందుతారు. దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. వాహన అనుకూలత కలుగుతుంది. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి.

వృశ్చికం: బంధువులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వృత్తి వ్యాపారాలలో శ్రమ పడ్డా ఫలితం కనిపించదు. వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. చేపట్టిన పనుల్లో జాప్యం తప్పదు. ఆర్థిక విషయాలు నిరుత్సాహపరుస్తాయి. నిరుద్యోగ ప్రయత్నలలో అవరోధాలు కలుగుతాయి.

ధనస్సు: చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. నూతన గృహ వాహనాలు కొనుగోలు చేస్తారు. కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. దూరపు బంధువుల ఆగమనంతో గృహమున ఉత్సాహంగా గడుపుతారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగులకు క్రమం క్రమంగా ఇబ్బందులు తొలగుతాయి.

మకరం: కుటుంబ సభ్యులతో దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆలయ దర్శనాలు చేసుకుంటారు. వ్యాపారాలు సాదాసీదాగా సాగుతాయి. ఆర్థిక ఇబ్బందులు చికాకు పరుస్తాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది.

కుంభం: స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. సోదరుల కలయిక ఆనందం కలిగిస్తుంది. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. సన్నిహితులతో వివాదాలు పరిష్కారమౌతాయి. వ్యాపారాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. ఉద్యోగులకు హోదాలు పెరుగుతాయి.

మీనం: ఇతరులకు సహాయ సహకారాలు అందిస్తారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు. ఆప్తులు సలహాలు కొన్ని విషయాలలో కలసి వస్తాయి. ఉద్యోగులకు పదోన్నతులు పెరుగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఆర్థిక అనుకూలత కలుగుతుంది.



# కిషన్ రెడ్డి.. నిన్నూ వదల

**మొదటి పేజీ తరువాయి**

హితవు పలికారు. గుజరాత్‌లో సబర్మతి రివర్‌ఫ్రంట్.. ఢిల్లీలో యమునా రివర్‌ఫ్రంట్ డెవలప్ చేశారని.. ఉత్తర్‌ప్రదేశ్‌లో గంగానది ప్రక్షాళన చేసినట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చెప్పారని గుర్తు చేసిన రేవంత్ రెడ్డి.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నదులను ప్రక్షాళన చేశారని బీజేపీ నేతలు గొప్పగా చెప్పుకొంటున్నారని మండిపడ్డారు. అదే సమయంలో మూసీ నది ప్రక్షాళనను మాత్రం వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీ తర్వాత తమ కార్యాచరణ మారుతుందని వెల్లడించారు. హైదరాబాద్ మెట్రో విస్తరణకు ఎందుకు కేంద్రం అనుమతి ఇవ్వదో.. తెలంగాణలో మొత్తం ధాన్యాన్ని ఎందుకు కొనరో.. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్)కు నిధులు ఎందుకు ఇవ్వరో.. మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటారో చూస్తామని రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. రాష్ట్రంలో చేసే మంచి పనుల విషయంలో రాజకీయాలు చేయొద్దని విజ్ఞప్తి చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్) లోపలే దాదాపు 1.34 కోట్ల మంది ప్రజలు నివసిస్తున్నారని పేర్కొన్న రేవంత్ రెడ్డి.. అంత జనాభాకు సదుపాయాలు కల్పించడమంటే అంత సులువు కాదని వెల్లడించారు. పరిపాలన సౌలభ్యం కోసమే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ)ని 3 కార్పొరేషన్లుగా విభజించినట్లు గుర్తు చేశారు. రాజకీయ లబ్ధి కోసమే తాము విభజించినట్లు ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. రాజకీయంగా పడిపోయిన తనను మళ్లీ నిలబెట్టింది మల్కాజిగిరి ప్రజలేనని గుర్తు చేసుకున్న రేవంత్ రెడ్డి.. కేంద్ర ప్రభుత్వ సహకారం లేకపోతే అప్పుడు ఎంపీగా అనుకున్న పనులు చేయలేకపోయానని.. కానీ ఇప్పుడు సీఎంగా మల్కాజిగిరిని అభివృద్ధి చేసే బాధ్యత తీసుకున్నానని వెల్లడించారు.



# ఏఐ దాహం..తీరనిది!

**మొదటి పేజీ తరువాయి**

స్వచ్ఛమైన నీటిని ఉపయోగిస్తాయి. ఏఐ మోడల్‌కు ఒకసారి శిక్షణ ఇవ్వడం కంటే, ప్రతిరోజూ కోట్ల మంది ఉపయోగించడం ఎక్కువ శక్తిని వినియోగిస్తోందని పరిశోధకులు చెబుతున్నారు. ఏఐ మొత్తం శక్తి వినియోగంలో 80%-90% వరకు రోజువారీ వినియోగమే కారణం. ఫొటోల సృష్టి, వీడియో జనరేషన్, భారీ ఏఐ మోడళ్ల వినియోగం వల్ల ఎక్కువ శక్తి వినియోగం అవుతోంది.

### భారత్‌పై ప్రభావం ఎంత?

భారత్ ప్రస్తుతం ప్రపంచంలోనే వేగంగా పెరుగుతున్న డేటా సెంటర్ మార్కెట్లలో ఒకటి. హైదరాబాద్, ముంబై, చెన్నై నోయిడా ప్రాంతాల్లో భారీ డేటా సెంటర్లు నిర్మాణంలో ఉన్నాయి. అయితే, భారత్ ఇప్పటికే నీటి కొరతను ఎదుర్కొంటోంది. విద్యుత్ డిమాండ్ అధికం అయ్యింది. ముఖ్యంగా వాతావరణ మార్పుల సమస్యలను ఎదుర్కొంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఏఐ మౌలిక సదుపాయాల విస్తరణను స్థిరమైన పద్ధతుల్లో నిర్వహించడం అత్యవసరం అని పర్యావరణ వేత్తలు నొక్కి చెప్తున్నారు. గ్రీన్ డేటా సెంటర్లు, లిక్విడ్ కూలింగ్ టెక్నాలజీ, తక్కువ విద్యుత్‌తో పనిచేసే మోడళ్ల అభివృద్ధి, విధానపరమైన నియంత్రణ అవసరం అని సూచిస్తున్నారు.



# రేవంత్‌కు స్ఫూర్తి హిట్లర్

**మొదటి పేజీ తరువాయి**

అంటే ఎవరినైనా అంతం చేయొచ్చని అర్థం. హిట్లర్‌కు ఉన్న కోర్ టీమ్ పేరు హైడ్రా. ఆ టీమ్ ఎవరినైనా అంతం చేయగలదు. కాబట్టి, నేను హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకొని ఈ వ్యవస్థకు హైడ్రా అని పేరు పెట్టాం' అంటూ రేవంత్ నవ్వులు చిందించారు. అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించాలనే ఉద్దేశంతోనే ఈ నియంతృత్వ కోణాన్ని సీఎం ప్రస్తావించినప్పటికీ, ఆయన చెప్పిన హిస్టరీ పూర్తిగా తప్పని తేలిపోవడంతో నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు.

### హిట్లర్ కోర్ టీంకు 'హైడ్రా' పేరుందా?

హిట్లర్ కోర్ టీమ్ పేరు హైడ్రా అంటూ చేసిన రేవంత్ వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని మేధావులు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండి, కనీస చరిత్ర తెలియకుండా హాలీవుడ్ కల్పిత కథలను నిజమని నమ్మడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అసలు చరిత్రలో హిట్లర్‌కు 'హైడ్రా' అనే కోర్ టీమ్ లేదు. అది ఆయనకు ఇష్టమైన పదమూ కాదు. 'మార్వెల్ కామిక్స్', 'కెప్టెన్ అమెరికా' సినిమాల్లో సృష్టించిన ఒక కల్పిత ఉగ్రవాద విలన్ ఆర్గనైజేషన్ పేరు 'హైడ్రా'. ఆ ఫిక్షనల్ స్టోరీలో దీనిని నాజీలకు అనుసంధానించి చూపించారు. ఆ సినిమా కథను నిజమైన చరిత్ర అనుకొని సీఎం రేవంత్‌రెడ్డి భ్రమపడ్డారంటూ నెటిజన్లు ఎద్దేవా చేస్తున్నారు. గ్రీకు పురాణాల ప్రకారం.. హైడ్రా అనేది చెడుకు సంకేతం. రాక్షసుల పెంపుడు జంతువు పేరు 'హైడ్రా'. దానికి పలు తలలు ఉంటాయి. ఒక్క తలను నరికేస్తే, రెట్టింపు తలలు కొత్తగా పుట్టుకొస్తాయి. 'ఎంతకీ పరిష్కారం కాని సమస్య'కు సంకేతంగా హైడ్రాను సూచిస్తారు. జర్మనీకి చెందిన హిట్లర్, గ్రీక్ పేరును తన కోర్ టీమ్‌కు పెట్టుకుంటాడా? ఇంత చిన్న లాజిక్ రేవంత్‌రెడ్డి ఎలా మిస్ అయ్యారు? అని నెటిజన్లు సెటైర్లు వేస్తున్నారు.



# పాఠశాలలు రీఓపెన్ జూన్ 15 నుంచి

మొదటి పేజీ తరువాయి

జూన్ 15కి వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది. పాఠశాలల పునఃప్రారంభం ఆలస్యం కావడం వల్ల విద్యార్థులు కోల్పోయే విద్యా సమయాన్ని, నిర్దేశిత పనిదినాలను భర్తీ చేసేందుకు విద్యాశాఖ ప్రత్యామ్నాయ మార్గాన్ని ప్రకటించింది. అకడమిక్ క్యాలెండర్ 2026-27 నియమాలను పక్కాగా పాటించేందుకు గానూ.. వచ్చే నెల జూలై 11న వచ్చే రెండో శనివారాన్ని సాధారణ పనిదినంగా మార్చారు. సాధారణంగా రెండో శనివారం లభించే సెలవును రద్దు చేస్తున్నట్లు విద్యాశాఖ స్పష్టం చేసింది. ఆ రోజున రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు యథావిధిగా నడుస్తాయని వెల్లడించింది. ఈ నూతన ఆదేశాలను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాంతీయ విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్లు, అలాగే అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులు తమ పరిధిలోని పాఠశాలల యాజమాన్యాలకు చేరవేసి తగిన చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ ఆదేశించారు.

# నేడు 'ఇండియా' భేటీ

**మొదటి పేజీ తరువాయి**

సమావేశానికి హాజరుకాబోతున్నారు. మరోవైపు, తమిళనాడులో విజయ్ ప్రభుత్వంలో కాంగ్రెస్ చేరడంతో, కాంగ్రెస్-డీఎంకే మధ్య విభేదాలు స్పష్టంగా బయటపడ్డాయి. దీంతో ఈ సమావేశానికి తాము రావడం లేదని డీఎంకే ఇప్పటికే ప్రకటించింది. ఈ సమావేశానికి 23 పార్టీలు హాజరవుతాయని కాంగ్రెస్ తెలిపింది. కాంగ్రెస్ తీరుపై అసంతృప్తితో ఉన్నప్పటికీ సీపీఎం ఈ సమావేశానికి

హాజరుకానుంది. పినరయి విజయన్, బీజేపీలు కుమ్మక్కు అయ్యాయంటూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ రెండు రోజుల క్రితం ఖర్గేకు లేఖ రాశారు. ఈ సమావేశాని ఫరూఖ్ అబ్దుల్లా నేతృత్వంలోని నేషనల్ కాన్ఫరెన్స్ కూడా సమావేశానికి వస్తున్నట్లు చెప్పింది. సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అధినేత అఖిలేష్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌లు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. ఇతర చిన్నాచితక పార్టీలు సమావేశానికి వస్తున్నట్లు చెప్పాయి. ఓటమి తర్వాత, కాంగ్రెస్ స్నేహాన్ని మమతా బెనర్జీ పార్టీ కోరుతున్నారు. ఉద్ధవ్ ఠాక్రేకు చెందిన శివసేన యూబీటీ వర్చువల్‌గా సమావేశంలో పాల్గొంటామని చెప్పింది.ఖ

# నేటి నుంచి చేప ప్రసాదం పంపిణీ

**మొదటి పేజీ తరువాయి**

భీమ్ రావు బడా వద్ద పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఆటోల కోసం షెజాన్ హోటల్ ముందు ప్రత్యేక స్టాండ్ ఉంటుంది. ఆర్టీసీ బస్సులు, వ్యాన్లను సీడబ్ల్యూసీ గ్రౌండ్‌లో నిలపాలి. ఎంజే మార్కెట్ బస్సులకు గాంధీ భవన్, నాంపల్లి బస్సులకు గృహ కల్ప చివరి స్టాప్‌లు కాగా, ప్రయాణికులు అక్కడ దిగి గేట్ నంబర్ 2 ద్వారా లోపలికి వెళ్లాలి. వీఐపీ వాహనాలు ఎంజే మార్కెట్ నుండి వస్తే అదాబ్ హోటల్ లేన్ వద్ద ఎడమకు తిరిగి, నాంపల్లి నుండి వస్తే గాంధీ భవన్ వద్ద యూటర్న్ తీసుకుని కేటాయించిన వీఐపీ పార్కింగ్‌కు చేరుకోవాలి.

# పవన్‌కు కిరీటం ఏం పెట్టలేదు!

**మొదటి పేజీ తరువాయి**

ఏమిటి?. మేము గొర్రెలం కాదు.. బానిస బ్రతుకు బ్రతకడానికి. ఈ బెదిరింపులు వద్దు నాగబాబు గారు. ప్రశ్నించడం మా హక్కు. ఏ నాయకుడైనా.. నేనే నాయకుడిని అనుకున్నవాడైనా, సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత ఉంటుంది. అర్థం అయిందా?" అని ప్రకాష్ రాజ్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇప్పుడు దీనిపై రామ్ గోపాల్ వర్మ రియాక్ట్ అయ్యారు. 'అసలు మీ ఉద్దేశ్యం ఏమిటంటే, ప్రజాస్వామ్యంలో తమ సమస్యలను పరిష్కరిస్తాడని నమ్మిన ప్రజలు ఒక నాయకుడికి బాధ్యతాయుతమైన పదవిని ఇస్తారు.. అతనికేమీ రాజుగా పట్టాభిషేకం చేయలేదు' అని రామ్ గోపాల్ వర్మ ట్వీట్ చేశారు. దీనిపై నెట్టింట్లో జోరుగా చర్చ నడుస్తోంది.



## కొమురవెల్లికి పోటెత్తిన భక్తులు

సిద్దిపేట, జూన్ 7 (ఈవార్తలు): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. శనివారం నుంచే ఆలయానికి చేరుకున్న భక్తులు ప్రైవేటు, దేవాలయ సత్రాలలో రాత్రి బస చేసి, ఆదివారం వేకువజామున లేచి కోనేరులో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పట్టింది. ఈ సందర్భంగా భక్తులు పట్నాలు, బోనాలు, అర్చనలు, అభిషేకాలు, కళ్యాణం, తిరుగుడు కోడె, తలనీలాలు తదితర మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపై ఉన్న రేణుక ఎల్లమ్మను దర్శించుకున్నారు. మండుటెండలను సైతం లెక్కచేయకుండా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి తరలివచ్చారు. వేసవి సెలవులు ముగుస్తున్న నేపథ్యంలో ఆలయానికి భక్తుల రద్దీ పెరిగినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. అయితే ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు, తాగునీటి కులాయిలు తగినంతగా లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. క్యూ లైన్లలో కనీస వసతులైన తాగునీరు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు లేకపోవడంపై కొందరు భక్తులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. అటు.. కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ కార్యనిర్వాహణాధికారిగా ఈవోగా కట్ట సుధాకర్ రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఈవోగా పనిచేసిన కృష్ణ ప్రసాద్ బదిలీపై వరంగల్ దేవాదాయ శాఖ ఉప కమిషనర్‌గా వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కట్ట సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, తాను బాసర, నాచారం లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం, కీసర దేవాలయాల్లో పని చేసినట్లు తెలిపారు. భక్తులకు మరింత మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ పర్యవేక్షకులు నీలా శేఖర్, ఆలయ సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్ రావు, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ భాషను అదుపులో పెట్టుకో

**టీబీజేపీ చీఫ్ రాంచంద్రారావు**



హైదరాబాద్, జూన్ 7 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తమ భాషను అదుపులో పెట్టుకోవాలని, మా నాయకులపై మాట్లాడే ముందు మాటలను జాగ్రత్తగా ఉపయోగించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు హెచ్చరించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలు మానుకొని, రాష్ట్ర ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చర్చకు సిద్ధమైతే, కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఏమిచ్చింది, రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలకు ఏమిచ్చింది అనే అంశాలపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని తేదీ, సమయం నిర్ణయిస్తే సెక్రటేరియట్ గేట్ వద్ద అయినా చర్చకు రావడానికి సిద్ధంగా ఉన్నామని సవాల్‌విసిరారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ మజ్లిస్ సహవాసంతో కాంగ్రెస్ నాయకత్వానికి నిజాం తరహా భాష, ధోరణి అలవాటైంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిర్బంధాలు, బెదిరింపులు, అణచివేత రాజకీయాలకు స్థానం లేదు. రజాకార్లు వ్యవహరించిన విధంగా వ్యవహరిస్తే తెలంగాణ ప్రజలు చూస్తూ ఊరుకోరు. ప్రజలు గతంలో నిరంకుశ శక్తులను ఎలా ఎదుర్కొన్నారో, అలాంటి ధోరణులను కూడా అదే విధంగా ఎదుర్కొంటారని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ రంగం సంక్షోభంలో ఉన్న సమయంలో రైతుల భూములను లక్ష్యంగా చేసుకోవడం ఆందోళనకరమన్నారు. కోహెడలో 239 ఎకరాల విస్తీర్ణంలో ప్రతిపాదించిన ఫ్రూట్ మార్కెట్ ప్రాజెక్టుకు రైతుల నుంచి భూములను సేకరించి, ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా సరైన నష్టపరిహారం చెల్లించకుండా బలవంతంగా స్వాధీనం చేసుకోవడం ద్వారా ప్రభుత్వం రైతులకు తీవ్ర అన్యాయం చేసింది. నష్టపరిహారం చెల్లించకుండా వారి భూములను స్వాధీనం చేసుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక వైఖరికి నిదర్శనం. రైతుల భూములు లాక్కొని, రైతులనే అరెస్ట్ చేసి, అదే రైతుల సంక్షేమం గురించి మాట్లాడటం కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని బయటపెడుతోంది. రైతుల నిరసనలను అణచివేసేందుకు అరెస్టులు, నిర్బంధాలు, హౌస్ అరెస్టులు చేయడం పోలీసు పాలనను, నిరంకుశ ధోరణిని తలపిస్తోంది. రైతులను, బీజేపీ నాయకులను నిర్బంధించడం అహంకారపూరిత, అప్రజాస్వామ్య పాలనే అన్నారు. రైతులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించిన తర్వాత మాత్రమే ఫ్రూట్ మార్కెట్ నిర్మాణ పనులు చేపట్టాలి. అప్పటి వరకు ఎలాంటి పనులు ప్రారంభించకూడదని డిమాండ్ చేశారు.

## రేవంత్‌కూ కేసీఆర్ గతే

**సీఎంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఫైర్**

హైదరాబాద్, జూన్ 7 (ఈవార్తలు): తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పట్టిన గతే ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డికి కూడా పడుతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ అబద్ధపు హామీలు, అసమర్థ పాలనతో ప్రజాగ్రహానికి గురై ఫామ్‌హౌస్‌కు పరిమితమయ్యారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే బాటలో నడుస్తూ ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో అధికారం మారినా ప్రజల ఆకాంక్షలు మాత్రం నెరవేరడం లేదని విమర్శించారు. అడ్డగోలు హామీలు, నమ్మకద్రోహంతో క్షేత్రస్థాయి సమస్యలను గాలికొదిలేశారని మండిపడ్డారు. సొంత దేశంలో జరుగుతున్న అభివృద్ధిపై విమర్శలు చేస్తూ, విదేశాలపై వ్యామోహం చూపించడం ఇద్దరు ముఖ్యమంత్రుల్లోనూ చూశామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా విదేశీ భాషలో మాట్లాడుతున్న రేవంత్ రెడ్డికి కూడా కేసీఆర్ కు పట్టిన గతే పడుతుందని కిషన్ రెడ్డి హెచ్చరించారు. చేతగాని పాలన అందిస్తున్న నేతల గ్రాఫ్ పాతాళానికి పడిపోవడం ఖాయమని ఆయన వ్యాఖ్యానించారు.

# 'డీపీ ఆర్కిటెక్ట్స్'కు ఫ్యూచర్ సిటీ ప్లాన్

**సింగపూర్ సంస్థ సర్కారు బాధ్యతలు**



హైదరాబాద్, జూన్ 7 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు రూపకల్పనలో కీలక అడుగు పడింది. ఈ మెగా సిటీ మాస్టర్ ప్లాన్ తయారీ కన్సల్టెంట్‌గా సింగపూర్‌కు చెందిన ప్రముఖ గ్లోబల్ డిజైన్ సంస్థ డీపీ ఆర్కిటెక్ట్స్‌ను ఖరారు చేశారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో చేపట్టబోయే ఈ ప్రాజెక్టు టెండర్లలో మొత్తం ఆరు అంతర్జాతీయ సంస్థలు పోటీ పడగా.. అత్యంత తక్కువ ధరకు కోట్ చేసిన డీపీ ఆర్కిటెక్ట్స్‌ను ప్రభుత్వం ఖరారు చేసింది. రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేటలో జూన్ 10న నూతనంగా నిర్మించిన భారత్ ఫ్యూచర్ సిటీ కార్యాలయం ప్రారంభోత్సవ వేడుక జరగనుంది. ఈ వేదికపైనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా సదరు సింగపూర్ సంస్థకు అధికారిక ఉత్తర్వులను అందజేయనున్నారు. ఈ మాస్టర్ ప్లాన్‌ను పూర్తి చేయడానికి కన్సల్టెంట్‌కు తొమ్మిది నెలల గడువు విధించారు. మొత్తం 765 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించిన ఎఫ్‌సీడీఏ పరిధిలో, మొదటి విడతగా 30 వేల ఎకరాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ స్థలంలో భూ వినియోగం, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనను గుర్తించనున్నారు. అందులోనూ అత్యంత ప్రాధాన్యత కలిగిన అభివృద్ధి కోసం 13 వేల ఎకరాలను ప్రత్యేకంగా వర్గీకరించారు. ఈ ప్రతిపాదిత ల్యాండ్ పూలింగ్‌లో వివిధ రంగాలకు భారీగా భూములను కేటాయించారు. ఇందులో ప్రధానంగా లైఫ్ సైన్సెస్ హబ్ కోసం 4 వేల ఎకరాలు, నివాస ప్రాంతాలైన రెసిడెన్షియల్ జోన్ కోసం 2477 ఎకరాలు, ఎలక్ట్రానిక్స్ అండ్ అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్ కోసం 2,177 ఎకరాలు, ఎలక్ట్రిక్ వెహికల్, ఎనర్జీ పార్క్ కోసం 1,976 ఎకరాలు కేటాయించారు. వీటితో పాటు హెల్త్ సిటీ వైద్య సేవల కోసం 594 ఎకరాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఏఐ సిటీ కోసం 403 ఎకరాలు, డేటా సెంటర్ హబ్ కోసం 313 ఎకరాలు, ఎడ్యుకేషన్ అండ్ యూనివర్సిటీ జోన్ కోసం 255 ఎకరాలను సిద్ధం చేశారు. అంతేకాకుండా ఒక భారీ ఎంటర్‌టైన్‌మెంట్ జోన్, ఫర్నిచర్ పార్క్, అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ హబ్ ఏర్పాటుకు కూడా ప్రాథమిక ప్రతిపాదనల్లో ల్యాండ్‌ను కేటాయించారు. ఎఫ్‌సీడీఏ ప్రాంతం ప్రస్తుతం రెండు ప్రధాన జోన్ల మధ్య విస్తరించి ఉందని అధికారులు వివరించారు. ఎఫ్‌సీడీఏ ఉత్తర భాగం ఇప్పటికే హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్ 2031 పరిధిలో విలీనమై, రవాణా నెట్‌వర్క్‌లు, మెట్రోపాలిటన్ కారిడార్లతో అభివృద్ధి చెందుతోందన్నారు. మధ్య భాగంలో ఉన్న హైదరాబాద్ ఫార్మా సిటీ ల్యాండ్‌ను లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్ వంటి ఫ్లాగ్‌షిప్ ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నారు. అయితే దక్షిణ భాగం మాత్రం పూర్తిగా గ్రామీణ వాతావరణంతో ఉండి ఎలాంటి చట్టబద్ధమైన భూవినియోగ ప్రణాళికలు లేకుండా ఉందన్నారు. ఇలాంటి సమయంలో సరైన మాస్టర్ ప్లాన్ లేకపోతే అస్తవ్యస్తమైన వృద్ధి, అధికార పరిధిల వివాదాలు, పర్యావరణ సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. హెచ్‌ఎండీఏ మెట్రోపాలిటన్ ఫ్రేమ్‌వర్క్‌కు, ఈ ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లకు మధ్య సమన్వయం కుదురుస్తూ.. ఫ్యూచర్ సిటీని నెట్-జీరో సూత్రాలతో గ్లోబల్ స్టాండర్డ్స్‌లో నిర్మించేందుకే ఈ మాస్టర్ ప్లాన్ వ్యూహం రూపొందించబడిందన్నారు.




## కార్యకర్తలే బీఆర్ఎస్ బలం: మాజీ మంత్రి తలసాని

హైదరాబాద్, జూన్ 7 (ఈవార్తలు): వచ్చే ఎన్నికలలో గోషామహల్ నియోజకవర్గంపై గులాబీ జెండా ఎగరాలని, అందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని మాజీమంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నియోజకవర్గ ఇంచార్జి నాగేందర్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో పైరవీలకు తావు లేదని, కష్టపడి పనిచేస్తూ ప్రజాదరణ ఉన్న వారికే సముచిత స్థానం, గౌరవం లభిస్తాయని స్పష్టం చేశారు. కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వంలో గోషామహల్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయని గుర్తుచేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం, రూ.10 కోట్లతో ఫిష్ మార్కెట్, నాలా నిర్మాణం, డ్రైనేజీ సమస్యల పరిష్కారం వంటి అనేక కార్యక్రమాలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ నెల 24 వ తేదీ నుండి ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అక్రమంగా ఓట్లు పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు చేపట్టాలని వివరించారు. ముఖ్యమంత్రి తన స్థాయిని మరిచి బూతు భాష మాట్లాడుతూ ఆయన స్థానానికి ఉన్న గౌరవాన్ని దిగజారుస్తున్నారని విమర్శించారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్, మహేందర్, ఉద్యమకారులు పాల్గొన్నారు.

# మీ పిల్లలను అమెరికా పంపొద్దు

**తమ్ముడి హత్యపై అన్షుల్ సోదరి ఆవేదన.. ఉద్దేశపూర్వక హత్యగా పోలీసుల అనుమానం**

మేడ్చల్ మల్కాజిగిరి, జూన్ 7 (ఈవార్తలు): "ఇది కేవలం అతడిని చంపడానికే పన్నిన పన్నాగం. దయచేసి మీ పిల్లలను అమెరికాకు పంపకండి" అంటూ అమెరికాలో హత్యకు గురైన హైదరాబాద్ యువకుడు అన్షుల్ కుంచ సోదరి తన్వి ఆవేదన వ్యక్తం చేశారు. ఇది దోపిడీ కోసం జరిగిన హత్య కాదని, ఉద్దేశపూర్వకంగా ట్రాప్ చేసి తన సోదరుడిని చంపారని ఆమె ఆరోపించారు. తన సోదరుడి మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వదేశానికి తరలించేందుకు సహాయం చేయాలని ఆమె భారత విదేశాంగ శాఖను కోరారు. హైదరాబాద్‌లోని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గుండ్లపోచంపల్లికి చెందిన అన్షుల్ కుంచ (28) అమెరికాలోని ఫిలడెల్ఫియాలో జూన్ 6వ తేదీన దారుణ హత్యకు గురయ్యాడు. ఖాళీగా ఉన్న అపార్ట్‌మెంట్ చిరునామాతో ఆర్డర్ ఇచ్చి దుండగులు ట్రాప్ చేశారు. పిజ్జా డెలివరీ కోసం వెళ్లిన అన్షుల్‌పై అతి సమీపం నుంచి కాల్పులు జరిపి హత్య చేశారు. అన్షుల్ నుంచి ఎలాంటి వస్తువులు దొంగిలించకపోవడంతో ఇది దోపిడీ హత్య కాదని, పక్కా పథకం ప్రకారమే జరిగిందని పోలీసులు అనుమానిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లిన అన్షుల్, ఇటీవలే డ్రెక్సెల్ యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ పూర్తి చేశాడు. ఓ మల్టీనేషనల్ కంపెనీలో డేటా అనలిస్ట్‌గా పనిచేస్తూ, అదనపు ఆదాయం కోసం వారాంతాల్లో పార్ట్‌టైమ్‌గా పిజ్జా డెలివరీ చేసేవాడు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న ఫిలడెల్ఫియా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇద్దరు అనుమానితులు అన్షుల్‌ను అనుసరించినట్లు సీసీటీవీ ఫుటేజ్‌లో రికార్డయింది. నిందితుల సమాచారం అందించిన వారికి 20,000 డాలర్ల రివార్డును పోలీసులు ప్రకటించారు. న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ కార్యాలయం స్థానిక అధికారులతో సంప్రదింపులు జరుపుతూ, అన్షుల్ కుటుంబానికి సహాయ సహకారాలు అందిస్తోంది.

**మీరిచ్చే ప్రతి పైసా..**
**ప్రజాస్వామ్య పరిరక్షణకే!**

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

## రేపటి నుంచి ఏపీఎల్ పండుగ

**ఈసారి మూడు నగరాల్లో నిర్వహణ**

విశాఖపట్నం, జూన్ 7 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో క్రికెట్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) నాలుగో సీజన్ అట్టహాసంగా ప్రారంభం కానుంది. ఈసారి కేవలం ఒక్క నగరానికే పరిమితం కాకుండా, రాష్ట్రంలోని మూడు ప్రధాన ప్రాంతాల్లో ఈ క్రికెట్ పండగను నిర్వహించనున్నట్లు ఆంధ్రా క్రికెట్ సంఘం (ఏసీఏ) అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని (శివనాథ్) ప్రకటించారు. జూన్ 9 నుంచి 30 వరకు జరగనున్న ఈ టోర్నమెంట్‌తో రాష్ట్రవ్యాప్తంగా క్రీడా వాతావరణాన్ని సృష్టించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గత సీజన్ల మాదిరిగా కాకుండా, ఈసారి ఏపీఎల్ మ్యాచ్‌లను విశాఖపట్నం, కడప, మంగళగిరి వేదికలుగా నిర్వహించనున్నారు. జూన్ 9న విశాఖపట్నంలో టోర్నమెంట్ ప్రారంభం కానుండగా, ఇక్కడ జూన్ 13 వరకు తొలి దశ మ్యాచ్‌లు జరుగుతాయి. అనంతరం జూన్ 17 నుంచి 21 వరకు రాయలసీమ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తూ కడపలో రెండో దశ మ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఇక చివరిగా, జూన్ 24 నుంచి 30 వరకు అమరావతి రాజధాని ప్రాంతంలోని మంగళగిరిలో ఫైనల్స్‌తో సహా చివరి దశ మ్యాచ్‌లు జరుగుతాయని కేశినేని చిన్ని వివరించారు.

## 10న తెలంగాణకు నైరుతి

హైదరాబాద్, జూన్ 7 (ఈవార్తలు): ఎండ తీవ్రతతో అల్లాడుతున్న రాష్ట్ర ప్రజలకు వాతావరణ శాఖ తీపి కబురు అందించింది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఈ నెల 10వ తేదీన, లేదా అంతకన్నా ముందే తెలంగాణను తాకే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం ఇవి అనుకూల వాతావరణ పరిస్థితుల మధ్య వేగంగా ముందుకు సాగుతున్నాయని, మరో మూడు రోజుల్లో రాష్ట్రంలోకి ప్రవేశించనున్నాయి. సాధారణంగా జూన్ ఒకటి లేదా మొదటి వారంలో రుతుపవనాలు వస్తాయి. ఇప్పటికే రుతుపవనాలు కేరళను తాకాయి. ఈ ఏడాది ఎల్ నినో తో ఆలస్యం అవుతాయని, ఈ ఏడాది తక్కువ వర్షపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ తెలిపింది. రుతుపవనాల రాకకు ముందే రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం చల్లబడనుంది.

# 'సర్'ను ఏడాది పాటు కొనసాగించాలి: కోదండరాం



హైదరాబాద్, జూన్ 7 (ఈవార్తలు): రాష్ట్రంలో ఈనెల 25 నుంచి ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఆగమేఘాల మీద ముగించకుండా, కనీసం ఒక సంవత్సరం పాటు కొనసాగించాలని తెలంగాణ జన సమితి పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం కేంద్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. నాంపల్లిలోని టీజేఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఎస్ఐఆర్‌పై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ మూడు నెలల్లో పూర్తికానుందని, కానీ ఈ సమయం సరిపోదన్నారు. కనీసం ఒక సంవత్సరం పాటు ఎస్ఐఆర్ ప్రక్రియను కొనసాగిస్తేనే ఓటర్లకు తగిన అవకాశం లభిస్తుందని కోదండరాం తెలిపారు. గతంలో ఎస్ఐఆర్ నిర్వహించిన రాష్ట్రాల్లో తగిన సమయం లేకపోవడం వల్ల పెద్ద సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయారని ఆయన ఆరోపించారు. తెలంగాణలో కూడా లక్షలాది మంది ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున ఎన్నికల సంఘం ఈ అంశాన్ని సానుకూలంగా పరిశీలించాలని కోదండరాం కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, వివిధ కారణాలు చూపుతూ పౌరుల ఓటు హక్కును తొలగించే పరిస్థితులు తలెత్తకుండా ఎన్నికల సంఘం పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని ఆయన సూచించారు. తమకు అందిన సమాచారం ప్రకారం తెలంగాణలో 68 శాతం మ్యాపింగ్ పూర్తయిందని, ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల ఏ ఒక్క పౌరుడు కూడా తన ఓటు హక్కును కోల్పోకుండా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని కోదండరాం స్పష్టం చేశారు. టీజేఎస్ పార్టీ శ్రేణులు ప్రజలకు అవగాహన కల్పించి, ప్రతి అర్హుడైన పౌరుడు తన ఓటు హక్కును పరిరక్షించుకునేలా సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి టీజేఎస్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలీమ్ పాషా అధ్యక్షత వహించారు. ఈ వర్క్‌షాప్‌లో సామాజిక కార్యకర్తలు ఇర్ఫాన్ ఖాన్, అబ్దుల్ ఖాలిఖ్, మారియోస్ ఎస్ఐఆర్ ప్రక్రియపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నిజ్జన రమేష్ ముదిరాజ్, అంబటి శ్రీనివాస్, ధర్మార్జున్, బైరి రమేష్, బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు జస్వంత్ కుమార్, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.



# ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడి

## సీజ్ ఫైర్ తర్వాత తొలి సారి క్షిపణుల ప్రయోగం

టెహ్రాన్: మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మళ్లీ పెరుగుతున్నాయి. ఏప్రిల్‌లో అమల్లోకి వచ్చిన కాల్పుల విరమణ తర్వాత తొలిసారిగా ఇరాన్ నేరుగా ఇజ్రాయెల్‌పై క్షిపణులు ప్రయోగించింది. పలుమార్లు క్షిపణి దాడులు జరిగినట్లు ఇజ్రాయెల్ రక్షణ దళాలు ప్రకటించాయి. తమ వైమానిక రక్షణ వ్యవస్థలు అన్ని క్షిపణులను అడ్డుకున్నాయని, ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం లేదా పెద్ద నష్టం జరగలేదని తెలిపాయి. ఇరాన్ ఈ దాడిని ఇజ్రాయెల్ ఇటీవల లెబనాన్ రాజధాని బీరూట్‌లోని హెజ్‌బొల్లా అనుబంధ ప్రాంతాలపై జరిపిన వైమానిక దాడులకు ప్రతీకారంగా పేర్కొంది. ఇజ్రాయెల్ తన దాడులు భద్రతా అవసరాల దృష్ట్యా చేపట్టినట్లు చెబుతుండగా, ఇరాన్ మాత్రం అవి కాల్పుల విరమణ ఉల్లంఘన అని ఆరోపిస్తోంది.

# లేకపోతే ఇరాన్ నాశనమే: ట్రంప్



వాషింగ్టన్: అణ్వాయుధం తయారు చేయకుండా ఇరాన్‌ను అడ్డుకుంటున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. అది ప్రమాదకరమైన దేశమని.. ఒకవేళ అణ్వాయుధం ఉంటే వాళ్లు ప్రపంచాన్ని నాశనం చేస్తారన్నారు. వాళ్లు వెర్రివాళ్లని వ్యాఖ్యానించారు. చర్చలతో ఈ సమస్యను పరిష్కరించాలని అనుకుంటున్నట్లు చెప్పారు. ఓ అంతర్జాతీయ వార్తా ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చిన ట్రంప్.. ఒకవేళ చర్చలు కొలిక్కి రాకపోతే ఆ దేశాన్ని నాశనం చేస్తానని హెచ్చరించారు. ఇరాన్ వద్ద అణ్వాయుధం లేకుండా చేయడం ద్వారా ప్రపంచానికి, అమెరికాకు సేవ చేస్తున్నానని ట్రంప్ పేర్కొన్నారు. తనకు సుదీర్ఘ యుద్ధాలు ఇష్టముండవని.. ఇది కూడా అంతులేని యుద్ధం కాదన్నారు. మూడు నెలలుగా యుద్ధం చేస్తున్నామని, ఇందులో ఎక్కువ భాగం కాల్పుల విరమణ కిందే ఉందన్నారు. చాలా విషయాల్లో ఏకాభిప్రాయం కుదిరిందన్నారు. ఇక ఇరాన్ సుప్రీం నేత మోజ్తాబా అలీ ఖమేనీ గురించి మాట్లాడుతూ.. దాడుల్లో ఆయన తీవ్రంగా గాయపడినట్లు తెలిసిందన్నారు.

# లోయలో పడి ఆర్మీ అధికారి వీర మరణం

రాజౌరి: జమ్మూ కాశ్మీర్‌లోని సరిహద్దు జిల్లా రాజౌరిలో శనివారం సాయంత్రం భారీ విషాదం చోటుచేసుకుంది. ఉగ్రవాదుల ఏరివేత లక్ష్యంగా సాగుతున్న 'ఆపరేషన్ షేరావాలి'లో పాల్గొన్న యువ ఆర్మీ అధికారి లెఫ్టినెంట్ బీరేశ్వర్ గోస్వామి ప్రమాదవశాత్తు లోయలో పడి వీరమరణం పొందారు. కొండ ప్రాంతాలు, ప్రతికూల వాతావరణం మధ్య సాగుతున్న ఈ ఉగ్రవేట చర్యల్లో ఆయన ప్రాణాలు కోల్పోయారు. రక్షణ శాఖ వర్గాల సమాచారం ప్రకారం.. రాజౌరి జిల్లాలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఉగ్రవాదుల కదలికలపై వచ్చిన నిఘా సమాచారంతో ఆర్మీ, పారామిలటరీ దళాలు సంయుక్తంగా 'ఆపరేషన్ షేరావాలి'ని చేపట్టాయి. శనివారం నాటికి ఈ ఆపరేషన్ విజయవంతంగా 16వ రోజుకు చేరుకుంది. ఈ క్రమంలోనే ఒక శోధన బృందానికి నేతృత్వం వహిస్తున్న లెఫ్టినెంట్ బీరేశ్వర్ గోస్వామి.. అత్యంత ఇరుకైన కొండప్రాంతం గుండా ముందుకు సాగుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి లోతైన లోయలోకి పడిపోయారు. తోటి సైనికులు తక్షణమే స్పందించి రెస్క్యూ ఆపరేషన్ చేపట్టినప్పటికీ.. తీవ్ర గాయాలపాలైన ఆయన అప్పటికే కన్నుమూశారు.

# దూసుకొస్తున్న సౌర తుపాను

### నేడు భూమిని తాకే ప్రమాదం.. విద్యుత్ గ్రిడ్లు, కమ్యూనికేషన్ వ్యవస్థలపై ప్రభావం



న్యూఢిల్లీ: సూర్యుడి నుంచి వెలువడిన ఒక భారీ సౌర తుపాను భూమి వైపు వేగంగా దూసుకొస్తోంది. ఈ తుపాను రేపు (జూన్ 8) సోమవారం నాటికి భూమిని తాకే అవకాశం ఉందని అమెరికాకు చెందిన నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ స్పేస్ వెదర్ ప్రిడిక్షన్ సెంటర్ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో జీ3 (తీవ్రమైన) స్థాయి జియోమ్యాగ్నెటిక్ తుపాను హెచ్చరికను జారీ చేసింది. జూన్ 9న కూడా జీ2 స్థాయి ప్రభావం ఉండొచ్చని తెలిపింది. జూన్ 6న సూర్యుడిపై ఉన్న యాక్టివ్ రీజియన్ 4461 నుంచి ఈ సౌర విస్ఫోటనం (కరోనల్ మాస్ ఎజెక్షన్) సంభవించింది. ఇది సెకనుకు సుమారు 1,400 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ సౌర తుపాను భూమి అయస్కాంత క్షేత్రంతో కలిసినప్పుడు జియోమ్యాగ్నెటిక్ తుపాను ఏర్పడుతుంది. ఈ తుపాను ప్రభావంతో సాధారణంగా ధ్రువ ప్రాంతాల్లో కనిపించే అరోరా కాంతులు (నార్తర్న్, సదరన్ లైట్స్) తక్కువ అక్షాంశాల వద్ద కూడా కనిపించే అవకాశం ఉంది. ఉత్తర భారతదేశం, ఐరోపాలోని కొన్ని ప్రాంతాలు, అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో వాతావరణం అనుకూలిస్తే ఈ అద్భుత దృశ్యాలను వీక్షించవచ్చు. అయితే ఉత్తరార్ధగోళంలో వేసవి కారణంగా రాత్రి సమయం తక్కువగా ఉండటం వీక్షణకు కొంత ఆటంకం కలిగించవచ్చు. జీ3 స్థాయి తుపాను వల్ల పవర్ గ్రిడ్లలో స్వల్ప హెచ్చుతగ్గులు, శాటిలైట్ నావిగేషన్ వ్యవస్థల్లో చిన్నపాటి సమస్యలు, హై-ఫ్రీక్వెన్సీ రేడియో కమ్యూనికేషన్లకు అంతరాయాలు ఏర్పడవచ్చని నిపుణులు చెబుతున్నారు. అయితే, పెద్ద ఎత్తున నష్టం జరగకపోవచ్చని అంచనా వేస్తున్నారు. సూర్యుడు ప్రస్తుతం సోలార్ సైకిల్ 25లో చురుకైన దశలో ఉండటంతో ఇలాంటి సంఘటనలు తరచుగా జరుగుతున్నాయని శాస్త్రవేత్తలు వివరించారు.

# విజయ్ సర్కారు ఉండేది మూడ్నెల్లే!

## డీఎంకే చీఫ్ స్టాలిన్ తీవ్ర విమర్శలు

చెన్నై: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ .. విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వం కొనసాగడంపై తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. విజయ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 3 నెలలు కూడా నిలవగలదా అనే చర్చ తమిళనాడు ప్రజల్లో ఇప్పటికే మొదలైందని వ్యాఖ్యానించారు. తన అనుచరులతో కలిసి పనియూర్ బాబు.. డీఎంకే పార్టీలో చేరిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడిన ఎంకే స్టాలిన్.. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 6 నెలల పాటు విమర్శలు చేయకూడదని తమ పార్టీ నిర్ణయించుకున్నట్లు గుర్తుచేశారు. టీవీకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు తాము 6 నెలల పాటు ఎలాంటి విమర్శలు చేయబోమని చెప్పామని.. అయితే ఆ గడువు పూర్తికాకముందే రాష్ట్రంలో జరుగుతున్న కొన్ని పరిణామాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయని స్టాలిన్ ఆరోపించారు. కానీ ఇప్పుడు తమిళనాడు ప్రజలు.. టీవీకే ప్రభుత్వం 6 నెలలు కాదు.. కనీసం 3 నెలలు అయినా కొనసాగుతుందా అని మాట్లాడుకుంటున్నారని స్టాలిన్ పేర్కొన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత టీవీకేపై స్టాలిన్ విమర్శలు చేయడం ఇది రెండోసారి కావడం గమనార్హం. గత నెలలో కూడా ఆయన టీవీకేను ఉద్దేశించి విమర్శలు చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే.. 2026 అసెంబ్లీ ఎన్నికల కోసం డీఎంకే సన్నాహాలు ప్రారంభించిందని గుర్తు చేసిన స్టాలిన్.. బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం, ఒంద్రినైవోమ్ వా సభ్యత్వ కార్యక్రమం, యువజన విభాగ ప్రాంతీయ



సమావేశాలు, నియోజకవర్గ ఇంఛార్జ్‌ల నియామకం వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఇంత చేసినా డీఎంకే తిరిగి అధికారంలోకి రాలేకపోయిందని పేర్కొన్నారు. కానీ టీవీకే ఓటర్లను కలవలేదని.. చాలా చోట్ల బూత్ ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లను కూడా నియమించలేదని.. అయినప్పటికీ గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేశారని విజయ్ విజయంపై స్టాలిన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయితే స్టాలిన్ నేరుగా టీవీకే పేరును ప్రస్తావించకుండా.. పరోక్షంగా వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ సందర్భంగా డీఎంకేలో చేరిన పనియూర్ బాబును స్టాలిన్ అభినందించారు. గత 5 ఏళ్లుగా అసెంబ్లీలో ఆయన పనితీరును తాను దగ్గరగా గమనించానని తెలిపారు. పనియూర్ బాబు అసెంబ్లీకి నిశ్శబ్దంగా వచ్చి, నిశ్శబ్దంగా వెళ్లేవారని.. కానీ మాట్లాడిన ప్రతిసారి నిర్మాణాత్మక అంశాలను లేవనెత్తేవారని గుర్తు చేశారు. తన నియోజకవర్గ సమస్యలను బలంగా వినిపించేవారని స్టాలిన్ పేర్కొన్నారు.

# బెంగాల్‌లో కొత్త జాతి చెదపురుగు

కోల్‌కతా: భారత జీవవైవిధ్యంలో మరో అరుదైన జీవి వెలుగులోకి వచ్చింది. పశ్చిమ బెంగాల్‌లోని అడవుల్లో శాస్త్రవేత్తలు సరికొత్త జాతి చెదపురుగును కనుగొన్నారు. దీని ప్రత్యేకత ఏంటంటే.. శత్రువుల నుంచి రక్షించుకోవడానికి తన దవడలతో 'టిక్ టిక్' మని శబ్దం చేసి తోటివాటిని అప్రమత్తం చేస్తుంది. ఈ ప్రత్యేక లక్షణం కారణంగా ఇది శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించింది. ఈ కొత్త జాతి చెదపురుగుకు 'సూడోకాప్రిటెర్మస్ నోవస్' అని పేరు పెట్టారు. దీని సైనికుల దవడలు వంకరగా, అసమ నిర్మాణంతో ఉంటాయి. ప్రమాదం ఎదురైనప్పుడు ఈ దవడలను ఒకదానికొకటి వేగంగా కొట్టుకోవడం ద్వారా అలారం లాంటి శబ్దాన్ని సృష్టిస్తాయి. ఇది రక్షణకు లేదా తమ సమూహానికి సమాచారం ఇవ్వడానికి ఉపయోగపడుతుంది. సాధారణంగా చెదపురుగులు అంటే ఇళ్లలోని ఫర్నిచర్‌ను, కలపను నాశనం చేసేవిగా మనకు తెలుసు. కానీ, ఈ కొత్తరకం చెదపురుగులు అందుకు పూర్తి భిన్నం. ఇవి మానవాళికి మేలు చేసేవి. నేలలో ఉండే కుళ్లిన ఆకులు, సేంద్రియ పదార్థాలను తిని జీవిస్తాయి. తద్వారా నేల సారాన్ని పెంచి, పర్యావరణ సమతుల్యతకు దోహదం చేస్తాయి. ఆరోగ్యకరమైన అటవీ ప్రాంతాలకు ఇవి సూచికగా నిలుస్తాయి. పశ్చిమ బెంగాల్‌లోని చప్రామరి వన్యప్రాణుల అభయారణ్యంలో కూలిన సాల వృక్షం దుంగ కింద మట్టిలో వీటిని గుర్తించారు. జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, కలకత్తా యూనివర్సిటీ పరిశోధకులు కలిసి ఈ ఆవిష్కరణ చేశారు. మైక్రోస్కోపిక్ పరిశీలన, డీఎన్ఏ పరీక్షల ద్వారా ఇది కొత్త జాతి అని నిర్ధారించారు. భారత్‌లో ఈ ప్రజాతికి చెందిన చెదపురుగుల్లో ఇది ఐదవది. ఈ ఆవిష్కరణ మన దేశంలోని అభయారణ్యాల్లో ఇంకా కనుగొనని ఎన్నో జీవ జాతులు ఉన్నాయనడానికి నిదర్శనంగా నిలుస్తోంది.

# ఖనిజాల అన్వేషణకు రూ.100 కోట్లు

### ఐదేళ్లలో 8.5 లక్షల చ.కి.మీ. ప్రాంతంపై విశ్లేషణ

న్యూఢిల్లీ: భారత ఖనిజాన్వేషణ రంగంలో సాంకేతికతను అందిపుచ్చుకుంటూ కేంద్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో కీలకమైన, భూగర్భంలో లోతుగా ఉన్న ఖనిజ నిక్షేపాలను గుర్తించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రూ.100 కోట్ల వ్యయంతో బెంగళూరులో "డేటా ప్రాసెసింగ్, ఇంటర్‌ప్రిటేషన్ అండ్ ఇంటిగ్రేషన్ సెంటర్" (డీపీఐఐసీ)ను జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) నెలకొల్పనుంది. ఈ కేంద్రం దశాబ్దాలుగా సేకరించిన భూగర్భ, భౌగోళిక, రసాయన, ఉపగ్రహ డేటాను విశ్లేషించడానికి ఒక ప్రధాన హబ్‌గా పనిచేస్తుంది. ఏఐ, మెషీన్ లెర్నింగ్ టెక్నాలజీల సహాయంతో ఖనిజాలు లభించే అధిక సంభావ్యత ఉన్న ప్రాంతాలను గుర్తించి, ప్రత్యేక మ్యాపులను రూపొందిస్తుంది. దీనివల్ల సంప్రదాయ పద్ధతులతో పోలిస్తే సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు నష్టభయం కూడా తగ్గుతుంది. రాబోయే ఐదేళ్లలో దాదాపు 8.5 లక్షల చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో ఖనిజ సంభావ్యతపై ఈ కేంద్రం విశ్లేషణ చేయనుంది. ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధనం, సెమీకండక్టర్లు, రక్షణ రంగాలకు అవసరమైన కీలక ఖనిజాల కోసం ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలన్న జాతీయ లక్ష్యంలో భాగంగా ఈ ప్రాజెక్టును చేపట్టారు. నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌లో ఇది ఒక ముఖ్యమైన అడుగు. ఈ అత్యాధునిక కేంద్రం ఏర్పాటు ప్రణాళికలు కొంతకాలంగా కొనసాగుతుండగా, జూన్ 7న దీనిపై స్పష్టమైన ప్రకటన వెలువడింది. ఈ పరిణామం ఖనిజ భద్రత కోసం సాంకేతికతను ఉపయోగించుకోవడంలో ప్రభుత్వ నిబద్ధతను తెలియజేస్తోందని, ఇది దేశ ఖనిజాన్వేషణలో ఒక గేమ్-ఛేంజర్‌గా నిలుస్తుందని అధికారులు భావిస్తున్నారు.



# అమెరికాలో టోలెడో పండుగలో విషాదం

### దుండగుల పరస్పర కాల్పుల్లో 12 మందికి గాయాలు

టోలెడో: అమెరికాలో తుపాకీ సంస్కృతి మరోసారి పడగ విప్పింది. ఒహియో రాష్ట్రంలోని టోలెడో నగరంలో శనివారం సాయంత్రం జరిగిన 'ఓల్డ్ వెస్ట్ ఎండ్ ఫెస్టివల్' లో దుండగులు జరిపిన కాల్పుల్లో కనీసం 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘోర ప్రమాదంలో ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం జరగనప్పటికీ, పండుగ వాతావరణంలో ఒక్కసారిగా బుల్లెట్ల వర్షం కురవడంతో జనం ప్రాణాలు చేతబట్టుకుని పరుగులు తీశారు. చారిత్రాత్మక నగరమైన టోలెడోలో 53వ వార్షిక ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. లైవ్ మ్యూజిక్, ఫ్యామిలీ ఈవెంట్లతో కుటుంబాలన్నీ పండుగను ఆస్వాదిస్తున్న తరుణంలో.. సాయంత్రం 5:37 గంటల ప్రాంతంలో డెలావేర్, గ్లెన్‌వుడ్ అవెన్యూల సమీపంలో ఒక్కసారిగా కాల్పుల శబ్దాలు వినిపించాయి. ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు ఒకరిపై ఒకరు పరస్పరం కాల్పులు జరుపుకోగా, అక్కడ గుమిగూడిన సామాన్య ప్రజలు ఈ క్రాస్‌ఫైరింగ్ లో చిక్కుకున్నట్లు పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే టోలెడో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను రక్షించారు. గాయపడిన వారిలో 14 ఏళ్ల మైనర్ల నుంచి 61 ఏళ్ల వృద్ధుల వరకు ఉన్నారని డిప్యూటీ పోలీస్ చీఫ్ జో హెఫెర్నన్ తెలిపారు. ఘటనా స్థలంలోనే ప్రథమ చికిత్స అందించి, బాధితులను వెంటనే స్థానిక ఆసుపత్రులకు తరలించారు.





# రాహుల్.. ఎక్కడున్నవ్ బిడ్డా!

**తల్లి, చెల్లి కన్నీటి పర్యంతం.. 10 రోజులుగా బీటెక్ విద్యార్థి మిస్సింగ్**

**కాచిగూడ స్టేషన్‌లో చివరి ఆచూకీ**

కోరుట్ల/జగిత్యాల, జూన్ 7 (ఈవార్తలు): 21 ఏండ్ల కొడుకు.. చదువు కోసం పట్నం పోయిండు.. మంచిగ చదువుకొని, జాబ్ తెచ్చుకుంటడని ఆశపడ్డరు కన్నోళ్లు.. కానీ, పది రోజులుగా కనిపించకుండా పోయి కన్నోళ్లు మిగుల్చుతున్నడు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం ఐలాపూర్ గ్రామానికి చెందిన అంకం రాహుల్ (21) హైదరాబాద్‌లో మాతృశ్రీ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. అయితే, గత పదిరోజులుగా రాహుల్ కనిపించకుండా పోయాడని, ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తుందని, దయచేసి ఎవరికైనా తెలిస్తే ఆచూకీ చెప్పండని యువకుడి తల్లి, చెల్లి అందర్నీ వేడుకుంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా, దర్యాప్తులో చివరిసారిగా కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద సంచరించినట్లు సీసీటీవీ ఫుటేజీలో తెలిసింది. అప్పటి నుంచి మళ్లీ రాహుల్ ఆచూకీ లేదు. దీంతో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. స్నేహితుల, బంధువులను విచారిస్తున్నారు.



# శేకల్ల శివారులో అగ్నిప్రమాదం

**పోలీసుల అప్రమత్తతతో తప్పిన ముప్పు**

బుగ్గారం, జూన్ 7 (ఈవార్తలు): బుగ్గారం మండల పరిధిలోని శేకల్ల గ్రామ శివారులో గుర్తుతెలియని వ్యక్తి నిర్లక్ష్యంగా నిప్పంటించడంతో మంటలు వేగంగా వ్యాపించి పలు ఎకరాల వ్యవసాయ భూములను చుట్టుముట్టాయి. మంటలు సమీపంలోని నివాస గృహాల వరకు చేరుకోవడంతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే బ్లూ కోల్ట్ విధుల్లో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ సంబేట శేఖర్ ఘటన విషయాన్ని ఎస్సై జి. సతీష్‌కు తెలియజేశారు. వారి ఆదేశాల మేరకు కానిస్టేబుల్ శేఖర్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, గ్రామస్థుల సహకారంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చి పూర్తిగా ఆర్పివేశారు. పోలీసుల తక్షణ స్పందన, గ్రామస్థుల సమిష్టి కృషితో పెద్ద ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులో ఉండి ప్రశాంతంగా ఉన్నట్లు పేర్కొన్నారు. వేసవి కాలంలో పొలాలు, గడ్డి ప్రాంతాలు, ఖాళీ స్థలాల్లో నిర్లక్ష్యంగా నిప్పంటించవద్దని పోలీసులు విజ్ఞప్తి చేశారు. అగ్నిప్రమాదాలు సంభవించి ప్రజా, వ్యక్తిగత ఆస్తులకు నష్టం కలిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ఎక్కడైనా అగ్నిప్రమాదాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. నిర్లక్ష్యంగా నిప్పంటించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు సంబంధిత శాఖ ద్వారా రూ.5,000 వరకు జరిమానా విధించబడుతుందని ఎస్సై జి. సతీష్ తెలిపారు.



# గ్రామాలకు ఎంపీ నిధులు కేటాయించాలి

**డాక్టర్ బోగ శ్రావణికి వినతిపత్రం అందజేత**

రాయికల్/జగిత్యాల, జూన్ 7 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని తాట్లవాయి, అలియా నాయక్ తండా గ్రామాల ఉపసర్పంచులు, వార్డు సభ్యులు బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ బోగ శ్రావణి ప్రవీణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఎంపీ నిధుల ద్వారా తాట్లవాయి, అలియా నాయక్ తండా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల కోసం ఎంపీ నిధుల ద్వారా ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని కోరినట్లు గ్రామ ప్రతినిధులు తెలిపారు. ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు తమ వంతు కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాట్లవాయి ఉపసర్పంచ్ నారాయణ, అలియా నాయక్ తండా ఉపసర్పంచ్ గణేష్, అంజిత్, జి.రెడ్డి, చి.గంగాధర్, చి.రాజు, కె.సంతోష్, ఎ.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్గాం అభివృద్ధికి మరో అడుగు

జగిత్యాల రూరల్, జూన్ 7 (ఈవార్తలు): జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గం గ్రామ అభివృద్ధికి మరో ముందడుగు పడింది. గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నూతన గ్రామపంచాయతీ భవనం, రూ.10 లక్షలతో మహిళా సంఘ భవన నిర్మాణాలకు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందన్నారు. జగిత్యాలకు అత్యధిక నిధులు కేటాయించేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారని తెలిపారు. తనపై కొందరు కావాలనే అసత్య ప్రచారాలు చేసినప్పటికీ ప్రజలు వాటిని విశ్వసించలేదని ఎమ్మెల్యే అన్నారు. జగిత్యాల ప్రజల ప్రేమాభిమానాలు తనకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజల ఆదరణ చూసి కొందరు వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని వ్యాఖ్యానించారు. నేడు జగిత్యాల విద్య, వైద్య రంగాలకు కేంద్రంగా మారిందని ఎమ్మెల్యే తెలిపారు. రూ.235 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలతో నూతన ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. విద్య, వైద్యం, వ్యవసాయం సహా అన్ని రంగాల అభివృద్ధికి తన వంతు కృషి కొనసాగుతుందని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అంతర్గం గ్రామంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులకు త్వరలోనే ఇళ్ల మంజూరు ప్రక్రియ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పేదలకు అత్యధిక గృహాలు మంజూరైన నియోజకవర్గాల్లో జగిత్యాల ముందంజలో ఉందని పేర్కొన్నారు. గ్రామాల్లో చెరువులు కలుషితం కాకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. లింగం చెరువు అభివృద్ధికి ప్రత్యేక కృషి చేసినట్లు తెలిపారు. రాజకీయాలు ఎన్నికల వరకు మాత్రమేనని, అభివృద్ధి మాత్రం నిరంతర ప్రక్రియ అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అంతర్గం గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ఇంకుడు గుంతల ఏర్పాటుకు గ్రామస్థులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, ఆత్మ కమిటీ ఛైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, సర్పంచ్ నోముల రమ్య-శేఖర్, ఉపసర్పంచ్ గోడిసెల బాలు, మాజీ ఏఎంసీ ఛైర్మన్లు కొలుగురి దామోదర్‌రావు, నక్కల రాధా రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో రమాదేవి, తహసీల్దార్ హకీమ్, మాజీ సర్పంచ్ బొనగిరి నారాయణ, మాజీ ఎంపీటీసీ రాజిరెడ్డి, బుపెల్లి శ్రీనివాస్, డీఈ మిలింద్, ఎంపీవో రవిబాబు, ఏఈ విజయ్, మహిళా సంఘాల సభ్యులు, నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





# 12 మంది అగ్నివీరులకు ఎమ్మెల్యే సన్మానం

జగిత్యాల, జూన్ 7 (ఈవార్తలు): జగిత్యాల ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్ నిరుద్యోగ యువతకు ఎంతో ఉపయోగపడుతోందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. యజ్ఞ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన కేంద్ర ప్రభుత్వ అగ్నివీర్ నియామక ప్రక్రియలో ఎంపికైన 12 మంది యువకులను ఎమ్మెల్యే ఆదివారం ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత ఉపాధి అవకాశాలు పొందేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తాము ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. క్రీడలు, శారీరక దారుఢ్య పరీక్షలకు సిద్ధమయ్యే యువత కోసం ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల మైదానంలో 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. అగ్నివీర్‌లో ఎంపికైన యువకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ చొరవతో ఏర్పాటు చేసిన రన్నింగ్ ట్రాక్ తమకు ఎంతో ఉపయోగపడిందన్నారు. శిక్షణలో భాగంగా ట్రాక్‌పై సాధన చేయడం వల్లే అగ్నివీర్ నియామకాల్లో విజయం సాధించగలిగామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా సైన్యం, పోలీస్, ఇతర ఉద్యోగాల కోసం సిద్ధమయ్యే యువతకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎంపికైన యువకులు మరింత ఉన్నత స్థాయికి చేరుకొని జగిత్యాల జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కాటిపల్లి గంగారెడ్డి, కౌన్సిలర్లు ఏనుగుల లావణ్య-రాజు, దయాల చంద్రకళ-శంకర్, కూతురు శేఖర్, బండ శంకర్, సమింద్ల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు తోట మల్లికార్జున్, కుసరి అనిల్, యజ్ఞ డిఫెన్స్ అకాడమీ నిర్వాహకులు శ్రీకాంత్ రెడ్డి, ఎంపీవో రవిబాబు, సీనియర్ నాయకులు బాలముకుందం, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండా సురేష్, ప్రధాన కార్యదర్శి సాగి శ్రీధర్‌రావు, గౌరవాధ్యక్షుడు మూలాసపు రాజన్న, మాజీ సర్పంచ్ రమణారావు, పురుషోత్తం రెడ్డి, మేనేని శ్రీధర్‌రావు, లక్ష్మారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# 120 మంది విద్యార్థులకు ఆర్యవైశ్య పురస్కారాలు

జగిత్యాల, జూన్ 7 (ఈవార్తలు): విద్యార్థులు ప్రతిభతోనే సమాజంలో ప్రత్యేక గుర్తింపు సాధించగలరని జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు, మెట్పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని మల్యాల క్రాస్‌రోడ్డులో గల కొత్త సురేశ్ ఫంక్షన్ హాల్‌లో శ్రీ వాసవి ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ పబ్బ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2025--26 విద్యా సంవత్సర జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య ప్రతిభా పురస్కార్ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 120 మందికి పైగా ఆర్యవైశ్య విద్యార్థినీ, విద్యార్థులను ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో సత్కరించారు. విద్యార్థుల తల్లిదండ్రులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి ప్రతిభా పురస్కారాలు అందజేస్తూ ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి సమాజ సేవకు ఉపయోగపడే స్థాయికి ఎదగాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావడంతో పాటు సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కేవలం విద్యలోనే కాకుండా లోకజ్ఞానంలోనూ ముందుండాలని విద్యార్థులకు సూచించారు. ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగితే విజయాలు సొంతమవుతాయని పేర్కొన్నారు. ముందుగా వాసవి మాత చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ పబ్బ శ్రీనివాస్, జగిత్యాల-మెట్పల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వూటూరి నవీన్, మైలారపు రాంబాబు, ఆర్టీఏ సభ్యుడు కంటాల శ్రీనివాస్, నాయకులు బుడికె శ్రీకాంత్, పల్లెర్ల రాజు, మర్యాల రాజన్న, కట్కం రాజేశ్, భూసం సతీష్, కట్కూరి సంతోష్, బొడ్ల జగదీశ్, చెట్ల పవన్ తదితరులు పాల్గొన్నారు.

## 41 మెడికల్ షాపులకు నోటీసులు

**రాష్ట్రవ్యాప్తంగా 166 మెడికల్ షాపుల్లో సోదాలు**

హైదరాబాద్, జూన్ 7 (ఈవార్తలు): రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్ ఫార్మసీలపై డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) ఉక్కుపాదం మోపింది. నిబంధనలను ఉల్లంఘిస్తున్నారనే పక్కా సమాచారంతో రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ పేరిట ముమ్మర తనిఖీలు నిర్వహించింది. ఈ దాడుల్లో మొత్తం 166 మెడికల్ షాపులను తనిఖీ చేయగా, తీవ్రమైన ఉల్లంఘనలకు పాల్పడిన 41 షాపులకు అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆన్‌లైన్ మెడిసిన్ డెలివరీ సర్వీసులు, వాటి అనుబంధ భాగస్వామ్య ఫార్మసీలకు చెందిన 159 షాపులతో పాటు, ఇండియామార్ట్ వంటి ఆన్‌లైన్ బీ2బీ ప్లాట్‌ఫామ్‌లతో సంబంధం ఉన్న మరో 7 షాపుల్లో డీసీఏ అధికారులు సోదాలు చేశారు. ఈ తనిఖీల్లో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగుచూశాయి. మందుల విక్రయాలకు సంబంధించిన సేల్స్ బిల్లులు, కొనుగోలు ఇన్‌వాయిస్‌లను నిర్వహించకపోవడం, ప్రిస్క్రిప్షన్ డ్రగ్స్, షెడ్యూల్ హెచ్1 డ్రగ్ రిజిస్టర్లను సరిగ్గా మెయింటైన్ చేయడంలో విఫలం కావడం, వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండానే యథేచ్ఛగా మందులు సరఫరా చేయడం, కనీసం క్వాలిఫైడ్ ఫార్మసిస్ట్ పర్యవేక్షణ కూడా లేకుండా మందులు విక్రయించడం వంటి ఘోరమైన నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లుగా అధికారులు తనిఖీల్లో గుర్తించారు.

## నెల్లూరు జనసేన కమిటీ రద్దు

మంగళగిరి, జూన్ 7 (ఈవార్తలు): జనసేన పార్టీలో ప్రక్షాళన దిశగా అధినేత పవన్ కల్యాణ్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఏపీలోని ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పార్టీ కమిటీలన్నింటినీ రద్దు చేస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. జిల్లా, నగర, మండల, గ్రామ స్థాయి కమిటీలను రద్దు చేస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపారు. నెల్లూరు జిల్లాలో నాయకుల మధ్య తీవ్రమైన విభేదాలు, క్రమశిక్షణారాహిత్యం పెరిగిపోయిందని పార్టీ అధిష్ఠానం దృష్టికి వచ్చినట్లు తెలుస్తోంది. నాయకులు పార్టీ విధానాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, వారి వైఖరి వల్ల కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జన సైనికులు, పార్టీ మద్దతుదారుల నుంచి ఫిర్యాదులు అందాయని పవన్ కల్యాణ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. "క్రమశిక్షణ లేని చోట వ్యవస్థను సక్రమంగా నిర్వహించలేం. అందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది" అని పవన్ వివరించారు. కొద్ది రోజుల క్రితమే ఉమ్మడి ప్రకాశం జిల్లా కమిటీని కూడా ఇదే కారణాలతో రద్దు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.



# ఏడాదిలోగా ప్రాజెక్టుల పూర్తి

**ప్రతి ఎకరానికి నీరందించడమే లక్ష్యం**

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

ధర్మపురి, జూన్ 7 (ఈవార్తలు): ధర్మపురి నియోజకవర్గంలోని ప్రతి ఎకరానికి సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను ఏడాదిలోపు పూర్తి చేసి రైతులకు పూర్తి స్థాయిలో నీటి సౌకర్యం కల్పిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలో మంత్రి సుడిగాలి పర్యటన నిర్వహించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయడంతో పాటు ముఖ్యమంత్రి సహాయనిధి, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. గొల్లపల్లి మండలంలోని చిల్వకోడూరు గ్రామంలో రూ.7.65 లక్షల వ్యయంతో చేపట్టనున్న పెద్ద చెరువు తూము మరమ్మతు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అనేక సాగునీటి ప్రాజెక్టులు అసంపూర్తిగా మిగిలిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి సుమారు రూ.1,000 కోట్లు అవసరమవుతాయని మంత్రి తెలిపారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ ప్రాజెక్టుల పూర్తికి సానుకూలంగా స్పందించారని చెప్పారు. పత్తిపాక రిజర్వాయర్, అక్కపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం, మేడారం రిజర్వాయర్ నుంచి కొత్తపల్లి వరకు కాలువల నిర్మాణంతో పాటు ఇతర పెండింగ్ పనులను ఏడాదిలోగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంత్రి అందజేశారు. మండలానికి చెందిన 17 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేయగా, 72 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.26.12 లక్షల విలువైన చెక్కులను అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి పథకాల కోసం ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. గొల్లపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన పోచమ్మ బోనాల ఉత్సవాల్లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బైండ్ల పూజారులు ఆయనకు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మపురి నియోజకవర్గ ప్రజలపై పోచమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాపల్లి గంగన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ బీమా సంతోష్, నాయకులు నిశాంత్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దాసరి తిరుపతి గౌడ్‌తో పాటు మండలంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

ఒయ్యారి చిత్రం



# వార్తలే నా పాటల లిరిక్స్: దేవీశ్రీ ప్రసాద్



మ్యూజిక్ డైరెక్టర్ దేవీ శ్రీ ప్రసాద్ కెరీర్‌లో ఎన్నో బ్లాక్‌బస్టర్ ఆల్బమ్‌లు, చార్ట్‌బస్టర్ పాటలు ఉన్నా.. ఆయన మ్యూజిక్ జర్నీ ఎలా మొదలైందన్న విషయం చాలా మందికి తెలియదు. తాజాగా సింగ్ గీతం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న దేవీ శ్రీ ప్రసాద్ తన చిన్ననాటి సంగీత ప్రయోగాల గురించి చెప్పిన ఆసక్తికర విషయాలు ప్రేక్షకులను అలరించాయి. తనకు చిన్నప్పటి నుంచే సంగీతంపై అమితమైన ఆసక్తి ఉండేదని, ఎప్పుడూ ఏదో ఒక ట్యూన్‌ను క్రియేట్ చేయాలని తపన పడేవాడినని గుర్తు చేసుకున్నారు. అయితే ట్యూన్ చేయడానికి లిరిక్స్ అవసరం అవుతాయని, కానీ తనకు పాటలు రాయడం రాకపోవడంతో ఒక వినూత్న మార్గాన్ని ఎంచుకున్నానని చెప్పారు. ఇంటికి ప్రతిరోజూ వచ్చే న్యూస్ పేపర్ లోని వార్తలనే లిరిక్స్‌లా ఉపయోగించి వాటికి ట్యూన్లు కట్టేవాడినని వెల్లడించారు. తండ్రి పేపర్ చదవడం పూర్తయ్యే వరకు ఎదురుచూసి, ఆయన వెళ్లిపోయాక ఆ పేపర్ ను తీసుకుని అందులోని న్యూస్ ను స్వరబద్ధం చేసేవాడినని, ఆ తర్వాత ఏమీ తెలియనట్టు తిరిగి అదే చోట పెట్టేవాడినని నవ్వుతూ వివరించారు. ఈ అలవాటు ఒకటి రెండు రోజులు కాదు, కొన్నేళ్ల పాటు కొనసాగిందని దేవీ చెప్పారు. మ్యూజిక్ పై ఉన్న ఇంట్రెస్ట్ కారణంగా ఎలాంటి పదాలైనా తనకు లిరిక్స్‌లా కనిపించేవని, వార్తలు కూడా తనకు పాటలుగా వినిపించేవని ఆయన వ్యాఖ్యానించారు. ఆ చిన్ననాటి ప్రయోగాలే తర్వాత తన సంగీత ఆలోచనలకు బలమైన పునాది అయ్యాయని చెప్పకనే చెప్పారు. మ్యూజిక్ డైరెక్టర్ గా ఎదిగిన తర్వాత కూడా కొత్త ఆలోచనలను వెతకడంలో అదే కుతూహలం తనను ముందుకు నడిపించిందని ఆయన మాటల్లో స్పష్టమైంది. సాధారణంగా మ్యూజిక్ స్టడీస్ లేదా ట్రైనింగ్ తోనే ప్రయాణం ప్రారంభమవుతుందని భావించే వారికి, చిన్న వయసులోనే దేవీ లాంటి ఓ అబ్బాయి న్యూస్ పేపర్ లోని వార్తలతో ట్యూన్లు కట్టడం నిజంగా ఆసక్తికరమైన విషయమే. అంతేకాదు, స్కూల్ డేస్ లో కూడా మ్యూజిక్ ను చదువుకు ఉపయోగించుకున్నానని దేవీ శ్రీ తెలిపారు. తొమ్మిది, పదో తరగతుల్లో ఎగ్జామ్స్ టైమ్ లో హిందీ సబ్జెక్ట్‌లోని కవితలను గుర్తుంచుకోవడం కష్టంగా అనిపించేదని చెప్పారు. దీంతో ఆ పద్యాలనే లిరిక్స్‌లా తీసుకుని వాటికి ట్యూన్లు కట్టేవాడినని, దాంతో అవి సులభంగా గుర్తుండిపోయేవని వెల్లడించారు. ఒక పద్యం అంటే ఒక ట్యూన్ అన్నట్టుగా గుర్తుపెట్టుకుని పరీక్షల్లో రాసేవాడినని చెప్పారు. ఒకసారి క్లాస్‌రూమ్‌లో ఆ ట్యూన్‌లను పాడుతుండగా, ఫ్రెండ్స్ వాటిని పాటలుగా ఎందుకు చేయకూడదని ఎంకరేజ్ చేశారని గుర్తు చేసుకున్నారు. ఆ ప్రోత్సాహంతో తొలిసారిగా సొంతంగా లిరిక్స్ రాసి ఒక అమ్మాయి గురించి పాటను కంపోజ్ చేశానని చెప్పారు. అయితే తాను చదివింది బాయ్స్ స్కూల్ కావడంతో ఆ పాటను వినిపించడానికి సరైన అమ్మాయి కూడా లేనందుకు అప్పట్లో నిరాశ చెందానని సరదాగా వ్యాఖ్యానించారు.

# సీనియర్ నటి సుకన్యకి ఊరట



ప్రముఖ సీనియర్ నటి సుకన్యకు దాదాపు మూడు దశాబ్దాల తర్వాత కోర్టులో ఊరట లభించింది. 30 ఏళ్లుగా సాగుతున్న ఒక పరువు నష్టం కేసులో మద్రాస్ హైకోర్టు ఆమెకు అనుకూలంగా తీర్పునిచ్చింది. నాటి గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ ఇంటర్వ్యూ ఆధారంగా జరిగిన ఈ వివాదంలో ప్రముఖ ఛానెల్ సన్ టీవీకి కోర్టు గట్టి షాక్ ఇచ్చింది. నటి సుకన్యకు రూ.10 లక్షల పరిహారం చెల్లించాలంటూ గతంలో వచ్చిన తీర్పును హైకోర్టు సమర్థించింది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు మీకోసం.అసలు ఏం జరిగింది?: అది 1996వ సంవత్సరం. అప్పట్లో సన్ టీవీలో 'నెరుక్కు నేర్' అనే ఒక పాపులర్ ప్రోగ్రామ్ ప్రసారమయ్యేది. అందులో అడవుల స్మగ్లర్ వీరప్పన్ ఇచ్చిన ఒక ఇంటర్వ్యూను టెలికాస్ట్ చేశారు. అయితే, ఆ ఇంటర్వ్యూలో నటి సుకన్య వ్యక్తిత్వాన్ని, పరువును దెబ్బతీసే విధంగా కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలు ఉన్నాయి. తనపై లేనిపోని నిందలు వేస్తూ ఆ కంటెంట్‌ను ప్రసారం చేశారంటూ సుకన్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆమె సన్ టీవీపై పరువు నష్టం దావా వేశారు. 2015లోనే మొదటి తీర్పు: కోర్టు మెట్లు ఎక్కిన సుకన్య న్యాయం కోసం గట్టిగానే పోరాడారు. ఈ క్రమంలో 2015లో లోయర్ కోర్టు ఈ కేసును విచారించి సుకన్యకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఇక ఆమె పరువుకు భంగం కలిగించినందుకు గానూ రూ. 10.01 లక్షల పరిహారాన్ని చెల్లించాలని సన్ టీవీ నెట్‌వర్క్‌ను ఆదేశించింది. కానీ, ఈ తీర్పును సవాల్ చేస్తూ సన్ టీవీ యాజమాన్యం మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. తాజాగా ఈ అప్పీల్‌పై విచారణ జరిపిన మద్రాస్ హైకోర్టు.. సన్ టీవీ పిటిషన్‌ను పూర్తిగా కొట్టేసింది. దిగువ కోర్టు ఇచ్చిన తీర్పే సరైనదని స్పష్టం చేసింది. ఇక ఏదైనా ఒక ఇంటర్వ్యూను టీవీలో ప్రసారం చేసే ముందు, అందులో ఇతరుల పరువుకు నష్టం కలిగించే విషయాలు ఉన్నాయా లేదా అని సరిచూసుకోవాల్సిన బాధ్యత మీడియా సంస్థలకు ఉంటుందని కోర్టు పునరుద్ఘాటించింది.

# స్వయంకృషికి మారుపేరు

భారతీయ చలనచిత్ర పరిశ్రమతో పాటు అంతర్జాతీయ వేదికలపై దేశ కీర్తిని చాటిన అరుదైన వ్యక్తుల్లో సుస్మితా సేన్ ఒకరు. 1994లో విశ్వసుందరి కిరీటాన్ని కైవసం చేసుకున్న తొలి భారతీయ మహిళగా చరిత్ర సృష్టించారు. ఆ తర్వాత బాలీవుడ్‌లో అడుగుపెట్టి తనదైన నటనతో.. స్వతంత్ర ఆలోచనలతో లక్షలాది మందికి స్ఫూర్తిగా నిలిచారు. కేవలం గ్లామర్ ప్రపంచానికే పరిమితం కాకుండా.. పారిశ్రామికవేత్తగా .. సింగిల్ మదర్‌గా సుస్మితా ససేన్ లీడ్ చేస్తున్న లైఫ్‌స్టైల్ నేటికీ అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. తాజాగా సుస్మితా సేన్ ఆస్తులకు సంబంధించి నెట్టింట చర్చ జరుగుతోంది. ఓ సారి ఆ వివరాల్లోకి ఎళ్తే ..ప్రస్తుతం సుస్మితా సేన్ నికర ఆస్తి విలువ సుమారు 100 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఈ సంపదందా సుస్మిత స్వయంకృషితో సంపాదించిందే. నటన.. బ్రాండ్ ఎండార్స్‌మెంట్లు .. వివిధ వ్యాపారాల ద్వారా ఆర్జించారు. బాలీవుడ్‌లో స్వయంకృషి గల స్టార్‌గా ఎదిగిన సుస్మిత, కేవలం నటిగానే కాకుండా ఆర్థిక వ్యూహాలతో బలమైన సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు. ముంబైలో అత్యంత ప్రతిష్టాత్మకమైన వర్సోవా ప్రాంతంలో సుస్మితా సేన్‌కు విలాసవంతమైన ఇల్లు ఉంది. ఎంతో కళాత్మకంగా రూపుదిద్దుకున్న ఈ లగ్జరీ అపార్ట్‌మెంట్ ఆమె అభిరుచికి అద్దం పడుతుంది. ఇంట్లోని ఇంటీరియర్ డిజైన్, ఆధునిక వసతులు , ప్రశాంతమైన వాతావరణం ముంబై సెలబ్రిటీల ఇళ్లలో ప్రత్యేకంగా నిలుస్తుంది. సుస్మిత తరచుగా తన కుమార్తెలు .. కుటుంబంతో గడిపే మధురమైన క్షణాలకు సంబంధించిన ఫోటోలలో ఇల్లు కనిపిస్తుంది. సుస్మితా సేన్ కేవలం నివాసం పరంగానే కాకుండా.. కార్ల కలెక్షన్ విషయంలోనూ లగ్జరీని ఇష్టపడతారు. ఆమె గ్యారేజీలో ప్రసిద్ధి చెందిన ఎన్నో ప్రీమియం బ్రాండ్ కార్లు ఉన్నాయి. వీటిలో లగ్జరీ ఎస్‌యూవీలతో పాటు ఖరీదైన సెడాన్ కార్లు కూడా ఉన్నాయి.

# ఆశిక బాటలో డింపుల్ హయాతి

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన రీసెంట్ మూవీ పెద్ది విడుదలైన తర్వాత సినిమాలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ పోషించిన అచ్చియమ్మ రోల్ పై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. మూవీలో ఆమె రోల్ కు సరైన ఇంపార్టెన్స్ ఇవ్వలేదని, కేవలం గ్లామర్ కే పరిమితం చేశారంటూ అనేక మంది నెటిజన్లు విమర్శలు చేస్తున్నారు. దీంతో ఇప్పటికే ఆ విషయంపై అనసూయ, ఆషిక రంగనాథ్ స్పందించగా.. తాజాగా నటి డింపుల్ హయాతి కూడా రెస్పాండ్ అయ్యారు. సినిమాల్లో హీరోయిన్ల రోల్స్ లో విషయంలో వస్తున్న విమర్శలపై డింపుల్ హయాతి సోషల్ మీడియాలో తాజాగా స్పందిస్తూ పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం హీరోయిన్స్ రోల్స్ ను ఎలా డిజైన్ చేస్తున్నారనే అంశంపై చర్చ జరగడం సంతోషకరమని ఆమె అన్నారు. అయితే సినీ ప్రియులతోపాటు నెటిజన్లు హీరోయిన్లను మాత్రమే తప్పుబట్టడం సరైన విధానం కాదని అభిప్రాయపడ్డారు. ఒక సినిమా సక్సెస్ కావాలంటే ఇలాంటి పాత్రలే అవసరమని, ఇలాంటివే ఉండాలని భావించే డైరక్టర్లు, రైటర్లు, నిర్మాతలు సహా మొత్తం సిస్టమ్ ను ప్రశ్నించాలని డింపుల్ హయాతి సూచించారు. హీరోయిన్లు తమకు వచ్చిన ఛాన్సుల పరిధిలోనే వర్క్ చేస్తారని, పెద్ద సినిమాల్లో నటిస్తూ మరింత మంది ప్రేక్షకులకు చేరువ కావాలని ట్రై చేస్తుంటారని డింపుల్ చెప్పారు. ఒక రోల్ కు సరైన స్థాయి స్కోప్ లేకపోతే.. ఆ బాధ్యత పాత్రను పోషించిన హీరోయిన్ ది అస్సలు కాదని ఆమె క్లారిటీ ఇచ్చారు. అది కంప్లీట్ గా రైటింగ్, సినిమా ప్రొడక్షన్, మేకింగ్ కు సంబంధించిన నిర్ణయమని వివరించారు.



# మంగళసూత్రంతో త్రిష!

స్టార్ హీరోయిన్ త్రిష మరోసారి వార్తల్లో హాట్ టాపిక్‌గా మారింది. తమిళనాడు సీఎం, నటుడు విజయ్‌తో త్రిష కొన్నేళ్లుగా ప్రేమలో ఉందని వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే విజయ్ భార్య సంగీత అతడికి విడాకుల నోటీసులు పంపగా... త్రిష విజయ్ కలిసి పలు కార్యక్రమాల్లో సందడి చేస్తున్నారు. విజయ్ సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన సమయంలోనూ త్రిష అక్కడ మెరిసింది. విజయ్ గెలుపు వెనుక కూడా త్రిష పూజల ఫలితం ఉందని తమిళనాట జోరుగా చర్చ జరిగింది. ఇక వీరిద్దరు ఎప్పుడు పెళ్లి చేసుకుంటారు అనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో త్రిష మరోసారి వార్తల్లో నిలిచారు. రీసెంట్ గా త్రిష ఓ కార్యక్రమంలో పాల్గొనగా ఆమె మెడలో ఓ లాకెట్ కనిపిస్తోంది. అయితే అది కచ్చితంగా కేరళ క్రిస్టియన్ స్టైల్ మంగళసూత్రం అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. దానిని మిన్ను అంటారని, కేరళలో క్రిస్టియన్స్ దీనినే మంగళసూత్రంగా కట్టుకుంటారని చెబుతున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాను షేక్ చేస్తుండటంతో విజయ్, త్రిష పెళ్లి జరిగిందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



# ఇది ముగింపు మాత్రం కాదు దిశాపటానీ

బీటౌన్ యంగ్ బ్యూటీ దిశా పటాని, ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'ఆవారాపన్ 2'. 2007లో విడుదలై కల్ట్ క్లాసిక్ హిట్‌గా నిలిచిన 'ఆవారాపన్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న ఈ ప్రాజెక్టుపై బాలీవుడ్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ.. ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్ర ప్రకటించారు. ఈ మేరకు తాజాగా ఈ సినిమా నుంచి మరో అప్డేట్ వచ్చింది. 'ఆవారాపన్ 2' ఫస్ట్ లుక్ టీజర్ జూలై 1న విడుదల కానున్నట్లు బాలీవుడ్ ఫిలిమ్ వర్గాల నుంచి టాక్. ఈ టీజర్ దిశ, ఇమ్రాన్ మధ్య ఉండబోతుందని తెలుస్తుంది. ఇదిలా ఉంటే.. ఈ సినిమా ప్రమోషన్స్ అప్పుడే స్టార్ట్ చేసిన దిశ.. సోషల్ మీడియాలో అదిరిపోయే పోస్టులతో కుర్రకారుని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంది. కాగా.. 'అభిమానులకు తెలుసు ఇది కేవలం ముగింపు మాత్రమే కాదని.. అతను మీ కోసమే మళ్లీ తిరిగి వచ్చాడు' అంటూ మేకర్స్ ఇటీవల రిలీజ్ చేసిన 'ఆవారాపన్ 2' ఫస్ట్ లుక్ పోస్టర్‌తో సినిమాపై మరిన్ని ఎక్స్‌పెక్టేషన్స్ పెరిగాయి. నితిన్ కక్కర్ దర్శకత్వం వహిస్తున్న ఈ క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్‌ను విశేష్ ఫిలిమ్స్ నిర్మిస్తుంది.








# మానవ్ సుతార్ అదుర్స్
## ఆఫ్ఘన్‌పై పట్టుబిగించిన భారత్..
### 451 పరుగుల ఆధిక్యంలో టీమిండియా.. ఫాలో-ఆన్ గండంలో ఆతిథ్య జట్టు

ఆఫ్ఘనిస్థాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో టీమిండియా పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. తొలి ఇన్నింగ్స్ లో భారీ స్కోరు సాధించిన గిల్ సేన, అనంతరం బౌలింగ్‌లోనూ చెలరేగి ఆఫ్ఘన్ జట్టును పీకల్లోతు కష్టాల్లోకి నెట్టింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆఫ్ఘనిస్థాన్ 5 వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసింది. భారత జట్టు కంటే ఇంకా 451 పరుగులు వెనుకబడి ఉంది. అరంగేట్రం చేసిన లెఫ్టార్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్ 3 వికెట్లతో అద్భుత ప్రదర్శన చేశాడు. అంతకుముందు, 564/8 పరుగుల వద్ద భారత్ తన తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. వాషింగ్టన్ సుందర్ (52 నాటౌట్) బాధ్యతాయుతమైన అర్ధశతకం సాధించగా, మహమ్మద్ సిరాజ్ (22) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. సుందర్ హాఫ్ సెంచరీ పూర్తి కాగానే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసి, బౌలర్లకు రెండు సెషన్ల సమయం ఇచ్చాడు. తొలి ఇన్నింగ్స్ ఆడేందుకు బరిలో దిగిన ఆఫ్ఘనిస్థాన్ ఆదిలోనే తడబడింది. పదునైన బంతులతో అదరగొట్టిన మానవ్ సుతార్, అబ్దుల్ మాలిక్‌ను తన తొలి వికెట్‌గా పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత ప్రసిద్ధ్ కృష్ణ నిప్పులు చెరిగే బంతితో సెదిఖుల్లా అటల్ వికెట్ తీశాడు. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో బ్యాటర్లపై ఒత్తిడి పెంచిన సుతార్, రహ్మానుల్లా గుర్బాజ్‌ను కూడా ఔట్ చేశాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా, రహ్మత్ షా (43 నాటౌట్) ఒంటరి పోరాటం చేశాడు. ఈ క్రమంలోనే టెస్టు క్రికెట్‌లో 1000 పరుగులు పూర్తి చేసుకున్న తొలి ఆఫ్ఘన్ ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. కెప్టెన్ హష్మతుల్లా షాహిదితో కలిసి 36 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పినప్పటికీ, ప్రసిద్ధ్ కృష్ణ అతడిని ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. కాసేపటికే అఫ్సర్ జజాయ్, సుతార్ బౌలింగ్‌లో రిటర్న్ క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. దీంతో ఆఫ్ఘనిస్థాన్ ఫాలో-ఆన్ గండంలో పడింది. రేపు ఆటకు మూడు రోజు కాగా, ఆఫ్ఘన్ జట్టును వీలైనంత త్వరగా ఆలౌట్ చేయాలని టీమిండియా భావిస్తోంది.





## వైభవ్‌తో పాటే తల్లిదండ్రులు
### యువ కెరటం కోసం బీసీసీఐ కీలక నిర్ణయం

భారత క్రికెట్‌లో సంచలనం సృష్టించిన 15 ఏళ్ల యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీకి బీసీసీఐ అండగా నిలిచింది. ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శనతో తొలిసారి జాతీయ జట్టుకు ఎంపికైన వైభవ్, రాబోయే ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలకు తన తల్లిదండ్రులను వెంట తీసుకెళ్లేందుకు బీసీసీఐ అనుమతి ఇచ్చింది. అంతేగాక వారి ప్రయాణ ఖర్చులన్నీ బోర్డే భరిస్తుందని ప్రకటించింది. స్పోర్ట్‌స్టార్ కథనం ప్రకారం అంతర్జాతీయ క్రికెట్ ఒత్తిడిని, కొత్త వాతావరణాన్ని తట్టుకుని నిలబడటానికి కుటుంబ సభ్యుల తోడు అతనికి ఎంతో సహాయపడుతుందని బీసీసీఐ భావిస్తోంది. "అతను ఇంకా చిన్నపిల్లవాడు కావడంతో కొత్త వాతావరణంలో సులభంగా సర్దుకుపోవడానికి అతని తల్లిదండ్రులను కూడా వెంట తీసుకెళ్లేందుకు అనుమతించాం. వారి ప్రయాణ ఖర్చులన్నీ బోర్డే భరిస్తుంది" అని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించినట్లు ఆ కథనం పేర్కొంది. ప్రస్తుతం వైభవ్, ట్రై-నేషన్ సిరీస్ కోసం ఇండియా-ఏ జట్టుతో కలిసి శ్రీలంక పర్యటనలో ఉన్నాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన వైభవ్ సూర్యవంశీ అసాధారణ ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ టోర్నీలో మొత్తం 776 పరుగులు సాధించి, టాప్ స్కోరర్‌గా ఆరెంజ్ క్యాప్ అందుకున్నాడు. ఇందులో ఒక సెంచరీ, ఐదు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అంతేగాక 'మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్', 'ఎమర్జింగ్ ప్లేయర్' అవార్డులను కూడా గెలుచుకున్నాడు. ఈ అద్భుత ప్రదర్శనే అతనికి ఐర్లాండ్, ఇంగ్లండ్, ఆసియా క్రీడల కోసం టీమిండియా టీ20 జట్టులో చోటు కల్పించింది.

## కెప్టెన్సీ గొప్ప గౌరవం: శ్రేయస్




భారత టీ20 క్రికెట్ జట్టుకు కొత్త కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ ఎంపికైన విషయం తెలిసిందే. ఈ కీలక బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన తొలిసారిగా స్పందించారు. రానున్న ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలతో పాటు 2026 ఆసియా గేమ్స్‌లోనూ టీమిండియాను అయ్యర్ నడిపించనున్నాడు. ముంబై టీ20 లీగ్‌లో ఓ మ్యాచ్ అనంతరం మాట్లాడిన అయ్యర్, తనపై నమ్మకం ఉంచిన బీసీసీఐకి కృతజ్ఞతలు తెలిపాడు. దేశానికి నాయకత్వం వహించే అవకాశం రావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నాడు. "భారత్‌కు ప్రాతినిధ్యం వహించడమే ప్రత్యేకం. అలాంటిది ఇప్పుడు జట్టుకు నాయకత్వం వహించడం మరింత ఆనందాన్ని ఇస్తోంది. కేవలం పరుగులు చేయడమే కాకుండా, కెప్టెన్సీతో జట్టును విజయాల బాట పట్టించడం 'ఐసింగ్ ఆన్ ది కేక్' లాంటిది. ఇన్నేళ్లుగా నాపై అభిమానులు చూపిస్తున్న ప్రేమ, మద్దతుకు ఎప్పుడూ రుణపడి ఉంటాను" అని శ్రేయస్ అయ్యర్ వ్యాఖ్యానించాడు.

## శ్రేయస్ రాణిస్తాడు: రోహిత్ శర్మ



భారత టీ20 జట్టు నూతన కెప్టెన్‌గా నియమితుడైన శ్రేయస్ అయ్యర్‌పై సీనియర్ ఆటగాడు, బ్యాటింగ్ దిగ్గజం రోహిత్ శర్మ పూర్తి విశ్వాసం వ్యక్తం చేశాడు. ఈ కొత్త బాధ్యతలో శ్రేయస్ తప్పకుండా రాణిస్తాడని ధీమా వ్యక్తం చేశాడు. అదే సమయంలో, భవిష్యత్ తరాల క్రికెటర్లను తీర్చిదిద్దడంలో టీ20 ముంబై లీగ్ ఒక ముఖ్యమైన వేదిక అని ప్రశంసించాడు. ముంబైలోని వాంఖడే స్టేడియంలో సోబో ముంబై ఫాల్కన్స్, ట్రయంఫ్ నైట్స్ జట్ల మధ్య జరిగిన టీ20 ముంబై లీగ్ మ్యాచ్ సందర్భంగా రోహిత్ ఈ వ్యాఖ్యలు చేశాడు. ఈ మ్యాచ్‌లో శ్రేయస్ అయ్యర్ 36 బంతుల్లో 61 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడి తన జట్టును గెలిపించాడు. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ, "ముంబై క్రికెట్‌లో ఆడటం ఎన్నో విషయాలు నేర్పుతుంది. ఇక్కడ ఏదీ సులువుగా రాదు. ప్రతిదీ కష్టపడి సంపాదించుకోవాల్సిందే. కెప్టెన్సీ కూడా అలాంటిదే. చుట్టూ ఉన్నవారి గౌరవాన్ని సంపాదించుకోవాలి" అని అన్నాడు. సూర్యకుమార్ యాదవ్, శ్రేయస్ అయ్యర్‌ల ప్రయాణాలను ఉదాహరణగా చూపుతూ, "సూర్యను చూడండి, అతను 31 ఏళ్ల వయసులో అరంగేట్రం చేశాడు. అంటే అతను ఎప్పుడూ పట్టు వదల్లేదు. ఇప్పుడు శ్రేయస్ టీ20 కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. గతంలో అతను తన ఫ్రాంచైజీకి, ముంబైకి కెప్టెన్‌గా వ్యవహరించిన తీరు చూస్తే, అతను కూడా మంచి విజయం సాధిస్తాడని నేను కచ్చితంగా చెప్పగలను" అని రోహిత్ తెలిపాడు. ఐపీఎల్‌లో ఆడని చాలా మంది యువ ఆటగాళ్లకు టీ20 ముంబై లీగ్ ఒక గొప్ప వేదిక అని, ఫ్రాంచైజీల యజమానులు ఈ టోర్నీని గమనిస్తారని హిట్ మ్యాన్ అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ ముగిసిన వెంటనే ఈ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు ముంబై క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు అజింక్య నాయక్‌ను, అతని బృందాన్ని రోహిత్ ప్రత్యేకంగా అభినందించాడు.

## పంత్ కొట్టిన బంతి డ్రోన్‌ను తాకిందా?

ముల్లాన్‌పూర్ వేదికగా టీమ్ఇండియా, అఫ్గానిస్థాన్ మధ్య ఏకైక టెస్ట్‌మ్యాచ్ జరుగుతోంది. ఈ నేపథ్యంలో తొలి రోజు ఆటలో భాగంగా 28 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద రిషభ్ పంత్ కొట్టిన బంతి డ్రోన్‌ను తాకి, అది కిందపడిపోయినట్లున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే ఇది నిజం కాదు. ఫేక్ వీడియో. ఎలా అంటే.. బంతి గమనంలో తేడా ఉంది. అలాగే టెస్ట్ క్రికెట్‌లో రెడ్ బాల్ వాడతారు. కానీ ఈ వీడియోలో మాత్రం వైట్ బాల్‌ను చూపించారు. ఈ వీడియోను కాస్త పరిశీలనగా చూస్తే ఇది ఏఐతో తయారు చేసినదని అర్థమవుతోంది. అయితే కొందరు ఏఐతో ఇలాంటి నకిలీ కంటెంట్‌ను క్రియేట్ చేసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తుండటంతో.. ఏది నిజమో.. ఏది అబద్ధమో తెలుసుకోవడం కష్టమవుతోంది. అందుకే సోషల్ మీడియాలో కనిపించేదంతా నిజం కాకపోవచ్చు. ఇలాంటి వీడియోల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అభిమానులు కామెంట్లు పెడుతున్నారు.

# మెదక్‌కు తిలక్ వర్మ
### వైస్ కెప్టెన్ కోసం పోటా పోటీ.. వేలంలో రూ.33 లక్షలు..
### డీజీపీ తనయుడికి రూ.17 లక్షలు.. మహ్మద్ సిరాజ్‌కు రూ.14 లక్షలు



తెలంగాణలోని స్థానిక క్రికెట్ ప్రతిభను వెలుగులోకి తెచ్చే లక్ష్యంతో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్ సీఏ) ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ టీ20 (టీజీ20) లీగ్ తొలి సీజన్ ఆటగాళ్ల వేలం ప్రక్రియ ఉత్సాహభరితంగా ప్రారంభమైంది. రామోజీ ఫిల్మ్ సిటీలోని ప్రిన్సెస్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం జరుగుతున్న ఈ వేలంలో యువ సంచలనం, టీమిండియా ఆటగాడు తిలక్ వర్మ రికార్డు ధర పలికాడు. ఐకాన్ ప్లేయర్ల జాబితాలో ఉన్న తిలక్ వర్మను 'మెదక్ ఫాల్కన్స్' ఫ్రాంచైజీ ఏకంగా రూ.33 లక్షల భారీ మొత్తానికి కొనుగోలు చేసింది. ఈ వేలం కోసం సుమారు 1300 మందికి పైగా హెచ్ సీఏ రిజిస్టర్డ్ క్రికెటర్లు తమ పేర్లను నమోదు చేసుకోగా, తుది జాబితాలో 160 మంది ఆటగాళ్లు వేలానికి వచ్చారు. 8 ఫ్రాంచైజీలు ఈ వేలంలో పాల్గొంటున్నాయి. ప్రతి ఫ్రాంచైజీకి ఆటగాళ్లను కొనుగోలు చేసేందుకు రూ.60 లక్షల పర్సును కేటాయించారు. ఐకాన్ ప్లేయర్ల జాబితాలో ఉన్న తిలక్ వర్మ కోసం మెదక్ ఫాల్కన్స్, పాలమూరు స్ట్రైకర్స్ మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. చివరి వరకు ఉత్కంఠగా సాగిన బిడ్డింగ్‌లో మెదక్ ఫ్రాంచైజీ భారీ ధరకు తిలక్‌ను సొంతం చేసుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇక టీమిండియా స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్‌ను 'వరంగల్ వారియర్స్' ఫ్రాంచైజీ రూ.14 లక్షలకు దక్కించుకుంది. అయితే, సిరాజ్ కంటే ఎక్కువగా తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తనయుడు, దేశవాళీ సీనియర్ పేసర్ సీవీ మిలింద్ ధర పలకడం విశేషం. మిలింద్‌ను 'అన్విత ఖమ్మం ఏసెస్' జట్టు రూ.17 లక్షలకు కొనుగోలు చేసింది. ఇది దేశవాళీ టోర్నీల్లో ఆటగాళ్ల ప్రదర్శనకు ఫ్రాంచైజీలు ఇస్తున్న ప్రాధాన్యతను స్పష్టం చేస్తోంది. ఇతర కీలక ఆటగాళ్లలో రవికిరణ్‌ను పాలమూరు స్ట్రైకర్స్ రూ.13 లక్షలకు, రవితేజను మెదక్ జట్టు రూ.12 లక్షలకు, అమన్ రావును వరంగల్ వారియర్స్ రూ.12 లక్షలకు కొనుగోలు చేశాయి. తనయ్ త్యాగరాజన్ (రంగారెడ్డి), ప్రగ్యాన్ రెడ్డి (పాలమూరు), అజయ్‌దేవ్ గౌడ్ (హైదరాబాద్), మహ్మద్ ఆర్ఫాజ్ అహ్మద్ (నల్గొండ), అభిరత్ రెడ్డి (హైదరాబాద్) వంటి ఆటగాళ్లు రూ.11 లక్షల చొప్పున ధర పలికారు. మరో ఐకాన్ ప్లేయర్ తన్మయ్ అగర్వాల్‌ను కరీంనగర్ డైమండ్స్ రూ.8 లక్షలకు సొంతం చేసుకుంది. ప్రముఖ ఆక్షనీర్ చారు శర్మ ఆధ్వర్యంలో ఈ వేలం ప్రక్రియ ప్రొఫెషనల్‌గా సాగుతోంది. ఈ లీగ్‌లో మొత్తం 8 జట్ల మధ్య 21 రోజుల పాటు 32 మ్యాచ్‌లు జరగనున్నాయి. హైదరాబాద్‌లోని ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియం ఈ టోర్నమెంట్‌కు వేదిక కానుంది. ఆటగాళ్లపై ఫ్రాంచైజీలు చూపిస్తున్న ఆసక్తి, కురిపిస్తున్న కాసుల వర్షం చూస్తుంటే తొలి సీజన్ టీజీ20 లీగ్ విజయవంతం కావడం ఖాయమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

# సమాచార యుగంలో 'ఫేక్' సవాలు

సమాచార విప్లవం మానవ సమాజాన్ని ఎన్నడూ లేనంతగా అనుసంధానించింది. ఒకప్పుడు వార్తలు పత్రికలు, రేడియో, టెలివిజన్ వంటి పరిమిత మాధ్యమాల ద్వారా మాత్రమే ప్రజలకు చేరేవి. కానీ నేడు స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉండగానే ప్రపంచం నలుమూలల సమాచారం క్షణాల్లో అందుబాటులోకి వస్తోంది. ఈ సాంకేతిక పురోగతి ఎంతటి అవకాశాలను తెచ్చిపెట్టిందో, అంతే ప్రమాదకరమైన సవాళ్లను కూడా ముందుకు తెచ్చింది. వాటిలో అత్యంత ఆందోళనకరమైనది 'ఫేక్ న్యూస్' లేదా తప్పుడు సమాచార వ్యాప్తి. ఫేక్ న్యూస్ అనేది కేవలం అసత్య వార్త మాత్రమే కాదు. ప్రజలను తప్పుదోవ పట్టించే ఉద్దేశంతో సృష్టించిన లేదా వాస్తవాలను వక్రీకరించి ప్రచారం చేసే సమాచారమంతా ఈ పరిధిలోకి వస్తుంది. సోషల్ మీడియా వేదికల విస్తరణతో ఇటువంటి వార్తలు నిమిషాల వ్యవధిలో లక్షల మందికి చేరుతున్నాయి. ఒక వ్యక్తి చేసిన పోస్టు లేదా ఫార్వర్డ్ చేసిన సందేశం సమాజంలో పెద్ద చర్చకు, కొన్నిసార్లు ఉద్రిక్తతలకు కూడా కారణమవుతోంది. ఫేక్ న్యూస్ ప్రభావం సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాలపై తీవ్రంగా పడుతోంది. మత, కుల, ప్రాంతీయ విభేదాలను రెచ్చగొట్టే తప్పుడు ప్రచారాలు సామాజిక సామరస్యానికి ముప్పుగా మారుతున్నాయి. ఎన్నికల సమయంలో తప్పుడు కథనాలు ప్రజల అభిప్రాయాలను ప్రభావితం చేయగలవు. ప్రజాస్వామ్యంలో ఓటరు తీసుకునే నిర్ణయం వాస్తవాలపై ఆధారపడాలి. కానీ అసత్య ప్రచారం ఆధిపత్యం చెలాయిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థే దెబ్బతినే ప్రమాదం ఉంది. ఆరోగ్య రంగంలో కూడా ఫేక్ న్యూస్ ప్రమాదకర ఫలితాలను కలిగిస్తోంది. కరోనా మహమ్మారి సమయంలో మందులు, వ్యాక్సిన్లు, చికిత్సల గురించి వ్యాపించిన అనేక తప్పుడు వార్తలు ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించాయి. శాస్త్రీయ ఆధారాలు లేని సమాచారాన్ని నమ్మడం వల్ల ప్రజారోగ్యానికి హాని కలిగే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇదే పరిస్థితి ప్రకృతి విపత్తులు, భద్రతా అంశాలు వంటి కీలక సందర్భాల్లోనూ కనిపిస్తోంది. ఈ సమస్యకు కేవలం ప్రభుత్వ నియంత్రణ ఒక్కటే పరిష్కారం కాదు. మీడియా సంస్థలు తమ బాధ్యతను మరింతగా గుర్తించాలి. వార్తల నిజానిజాలను నిర్ధారించే వ్యవస్థలను బలోపేతం చేయాలి. సోషల్ మీడియా సంస్థలు కూడా తప్పుడు సమాచారాన్ని గుర్తించి అడ్డుకునే చర్యలను మరింత సమర్థంగా అమలు చేయాలి. అయితే అంతకంటే ముఖ్యమైనది ప్రజల్లో డిజిటల్ అక్షరాస్యత పెరగడం. ప్రతి సమాచారం నిజమా కాదా అన్న విషయాన్ని పరిశీలించే అలవాటు పెంపొందించుకోవాలి. మూలాలను ధృవీకరించకుండా సందేశాలను పంచుకోవడం మానుకోవాలి. సమాచార యుగంలో సమాచారం ఒక శక్తి. అదే సమయంలో అది బాధ్యత కూడా. నిజం, అబద్ధం మధ్య గీత చెదిరిపోతున్న ఈ కాలంలో విమర్శనాత్మక ఆలోచన, వాస్తవ నిర్ధారణ, బాధ్యతాయుత సమాచార వినియోగం అత్యవసరమయ్యాయి. ఫేక్ న్యూస్‌ను ఎదుర్కోవడం కేవలం ప్రభుత్వాలు లేదా మీడియా బాధ్యత మాత్రమే కాదు; ప్రతి పౌరుడి సామాజిక కర్తవ్యం కూడా. నిజమైన సమాచారాన్ని ప్రోత్సహించినప్పుడే ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యం, సమగ్ర సమాజం నిర్మాణం సాధ్యమవుతుంది.

దేవలోకం తలుపులు..
భూమిని పాలించే మహర్లోకం..
మనిషి వెళ్లలేని దివ్యలోకం..
దేవుడు నివసించే లోకం..
స్వర్గసుఖాల్ని అందించే లోకం..
దేవలోకం జాడ తెలిసింది..
ఆ ఇంటి తలుపులు
తెరుచుకున్నాయి.



# "దేవుడి ఇల్లు"



కోవెల సంతోష్ కుమార్
రచయిత, 91 9052116463

మనిషికి దేవుడి ఇల్లు కనపడటం ఏమిటి? కాస్త కన్‌ఫ్యూజన్‌గా ఉన్న మాట వాస్తవమే. కానీ, ఇది వాస్తవం. అది కూడా భూమ్మీదే లభించింది. ఎందుకంటే ప్రపంచం నమ్ముతున్న విశ్వాసం ఇది. ప్రస్తుతం ప్రపంచంలో అతి ప్రాచీన నాగరికతలు లభ్యమవుతున్న చోటే కనిపించిందీ దేవుడి ఇల్లు. పెరు.. దక్షిణ అమెరికాకు పశ్చిమంగా ఉన్న రిపబ్లిక్ దేశం. మనిషి నాగరికతకు అత్యంత ప్రాచీనమైన మూలాలు బయట పడిన ప్రదేశం ఇది.. ఆది మానవుడి అవశేషాలు దొరికిన ప్రదేశం.. ఇప్పుడు దేవుడి ఇల్లు జాడ చెప్తోన్న ప్రదేశం.. ఇక్కడే దేవుడి ఇల్లును కనుగొన్నది.. మనుషులు లేని సమయంలో ఈ తలుపు తెరుచుకుంటుంది. దేవుడు భూమిపైకి వచ్చి మళ్లీ ఇక్కడి నుంచే తిరిగి తన లోకానికి వెళ్లిపోతాడు. పెరులోని చాలా మంది స్థానికులకు ప్రత్యక్షంగా అనుభవంలోకి వచ్చిన విషయమిది. ప్రపంచంలో ఎక్కడా కనిపించని చాలా మూలాలు బయటపడింది పెరూ లోనే. భూమ్మీద తొలి మానవ జంట ఆడమ్, ఈవ్లను దేవుడు ఇక్కడే సృష్టించాడంటారు. ఈ అడవుల్లోనే వాళ్లు తిరిగారు.. ఆడుకున్నారు.. దేవుడి ఆజ్ఞను ధిక్కరించి ఆపిల్ పండు తిన్నారు. ఇవాల్టి ఈ సృష్టికి మూల కారణమయ్యారనీ నమ్ముతారు. ఈ ఆది మానవుణ్ణి సృష్టించడానికి దేవుడు భూమిపైకి వచ్చిన ప్రాంతమే దేవుడి నివాసమని భావిస్తున్నారు. ఆయన తన నివాసం నుంచి బయలు దేరి ఆ తలుపులోంచి భూమ్మీదకు వచ్చాడు. దక్షిణ పెరులో 12,800 అడుగుల ఎత్తైన ఆండెస్ పర్వత శ్రేణుల్లో విచిత్రమైన ఈ నిర్మాణం కనిపిస్తుంది. వేల సంవత్సరాల నుంచి భూమ్మీద ఉన్న మిస్టీరియస్ నిర్మాణం ఇది. ఈ కొండకు ఒక ద్వారం ఉంది. దానికి ఒక కీహోల్ కూడా ఉంది. ఇందులోంచే దేవుడు భూమ్మీద కాలు మోపాడన్నది ఒక విశ్వాసం.

ఈ ద్వారం గుండా లోపలికి ప్రవేశించగలిగితే.. దేవుడి నివాసానికి వెళ్లే దారి కనిపిస్తుందిట. అది మామూలుగా ఉన్నప్పుడు రాయి లాగానే ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ఆక్టివేట్ అవుతుంది. అప్పుడు మాత్రమే అది తెరుచుకుంటుంది. అది యాక్టివేట్ అయినప్పుడు అక్కడున్న ప్రతి వారికీ విచిత్రమైన ఎక్స్‌పీరియన్స్ కలుగుతుంది. ఇది ఒక సాండ్ స్టోన్.. అదీ చతురస్రాకారంలో ఉంది. దీని పేరు అమర్ మెరు. సైంటిఫిక్గా చూస్తే ఇది ఒక రాతి కట్టడం మాత్రమే. దీన్ని దేవుడి తలుపుగా ఎలా భావించాలి? స్థానికుల విశ్వాసాన్ని ఎలా ప్రాతిపదికగా తీసుకోవాలి? కానీ, ఇదే నిజం.. ఇది స్థానికుల విశ్వాసం మాత్రమే కాదు.. అక్కడికి వెళ్లే ప్రతి పర్యాటకుడికీ ఎదురయ్యే అరుదైన అనుభవం. దేవుడి తలుపు ఒక నిజం. అది యాక్టివేట్ కావటమూ నిజం.

అమర్మెరూ డోర్ వే వెనుక శక్తులు ఉన్నాయనే అక్కడికి వెళ్లిన ప్రజలంతా విశ్వసిస్తారు. దాని వెనుక సైన్స్‌కు అంతుపట్టని ఏవో తరంగాలు పని చేస్తున్నాయి. దాని దగ్గరకు వెళ్లిన వారికి విచిత్రమైన అనుభవం కలుగుతోంది. అక్కడ దైవశక్తి ప్రబలంగా ప్రభావితం చేస్తుంది. అక్కడి గాలిలో, ధూళిలో, నేలలో, ఆకాశంలో అంతటా దైవమే కనిపిస్తుంది. ఆ తలుపు వెనుకే మహర్లోకపు మార్గముండటం వల్లనే ఇదంతా జరుగుతుందని అందరి నమ్మకం. దక్షిణ పెరులో టిటికాకా సరస్సు ప్రాంతంలో అమర్ మరు డోర్వే ఉంది. ఇది సాండ్ స్టోన్ ఉన్న నిర్మాణం. ఇది మానవ నిర్మితమనటానికి ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఆకాశం నుంచి దిగి వచ్చిన వారికి సంబంధించిన నిర్మాణమే ఇదని అంతా నమ్ముతారు. ఈ నమ్మకం తప్ప దీనికే ఆధారంలేదు.. సైంటిఫిక్గా ఏ విధంగానూ రుజువు కాని మిస్టరీ ఇది. సాండ్ స్టోన్ మౌంటెన్ ఒక పద్ధతి ప్రకారం ఎలా ఏర్పడిందన్నది ఇంతవరకూ తేలలేదు. చతురస్రాకారంగా ఒక పర్వతం తనంత తానుగా ఏర్పడటం ఎలా సాధ్యం? దీనిపై రకరకాల పరిశోధనలు చేశారు. కాల నిర్ణయం కోసం కార్బన్ డేటింగ్ చేశారు. కానీ, ఏదీ స్పష్టం కాలేదు. ఏదీ అర్థం కాలేదు. కానీ, దీని దగ్గర ఎలక్ట్రో మాగ్నెటిక్ పవర్ లాంటిది ఏదో ఇక్కడ దాగి ఉంది. ఇదేదో ఆషామాషీగా చెప్పుతున్న సంగతేం కాదు.. మీరూ చూడవచ్చు. టిటికాకా సరస్సుకు షికారుకు వచ్చిన జెర్రీ అనే వ్యక్తి డోర్వే గురించి తెలుసుకోవాలనుకున్నాడట.. ఎర్రని షాల్ చుట్టూ కప్పుకుని డోర్వేలోకి ఎంటర్ అయిపోయాడు.. కొద్ది సేపటికే ఎలక్ట్రో తరంగాలు అతణ్ణి చుట్టుముట్టాయి.

అంతా చూస్తుండగానే ఒక్కసారిగా అతను మాయమైపోయాడని చెప్తారు. డోర్వే ముందు నిలుచున్న జెర్రీకి ఉన్నట్టుండి ముందుకు పడిపోతున్న ఫీల్ కలిగింది. ఏం జరుగుతోందో అర్థం కాలేదు.. ముందు ఒక గొప్ప వెలుగుతో ఉన్న దారి కనిపించింది. అంతా చూస్తూనే ఉన్నారు.. కళ్ల ముందే జెర్రీ ఒక్కసారిగా మాయమైపోయాడు.. ఏం జరిగిందో అర్థం అయ్యే లోగానే.. మళ్లీ ఎలా మాయమయ్యాడో.. అలాగే ప్రత్యక్షమై పోయాడు.. ఇదంతా జరిగేసరికి ఒకటిన్నర నిమిషం వ్యవధిలోనే జరిగిపోయింది. ఇదెట్లా సంభవించిందంటే ఎవరికీ తెలియదు.. సైన్స్ కూడా ఇప్పటికీ డిఫైన్ చేయలేకపోయింది. ఇక్కడే మరో విచిత్రం ఉంది. ఈ దేవుడి తలుపుకు ఒక కీహోల్ వంటి రంధ్రం కూడా ఉంది. దీని ద్వారానే గేట్ తెరుచుకుంటుందని, ఇందులోంచే దైవ శక్తి తరంగాలు వెలుపలికి వస్తాయని అంటారు. పెరులో ప్రాచీన మానవ నాగరికతకు సంబంధించిన చాలా చాలా ఆనవాళ్లు బయటపడ్డాయి. కానీ, దేనికీ లేని ప్రాధాన్యం డోర్వే ఆఫ్ అమరు మెరుకు వుంది. భూమ్మీద మరెక్కడా కనిపించని మిస్టీరియల్ పవర్ ఇక్కడ స్పష్టంగా ప్రతి ఒక్కరికీ అనుభవంలోకి వస్తుంది. అన్నింటికీ మించి ఈ డోర్కు ఉన్న కీహోల్ రహస్యం ఏమిటి? టిటికాకా సరస్సు పక్కనే నివసించే స్థానికులు రోజూ ఉదయాన్నే ఈ దేవుడి తలుపుకు సంప్రదాయ బద్ధంగా పూజలు చేస్తారు. వీళ్లంతా పేద రైతులు. ఈ దేవుడి తలుపుకు ఎదురుగా ఉన్న పొలాల్లో వ్యవసాయమే వీళ్లకు ఆధారం. ఇక్కడ మాత్రమే వీళ్లు వ్యవసాయం చేస్తారు. ఈ ప్రాంతాన్ని వదిలి ఇంకెక్కడికీ వెళ్లరు. తరాల కొద్దీ కొనసాగుతున్న సంప్రదాయమే ఇది. రాత్రి పూట మాత్రం ఏ ఒక్కరూ కూడా ఈ దేవుడి తలుపు దరిదాపుల్లోకి కూడా రారు. ఎందుకంటే స్థానికులకు ఇక్కడ చాలా అనుభవాలు ఎదురయ్యాయి. దీనికి ఎదురుగా ఆడుకోవటానికి వెళ్లిన పిల్లలు మాయమైపోయారని చెప్తారు. పెరులో దొరికిన శాసనాల ప్రకారం తొలి మత గురువుల్లో ఒకరైన అమరు మెరు.. ఈ గేట్వేను తెరిచేందుకు ప్రత్యేక పరికరాన్ని తయారు చేశాడు. ఇది ఒక గోల్డెన్ డిస్క్ ఆకారంలో ఉంటుంది.

ఈ గేట్వేను ఈ గోల్డెన్ డిస్క్ సహాయంతోనే యాక్టివేట్ చేసేవారు. ఇది ఒకసారి యాక్టివేట్ అయితే.. దీని లోపలికి వెళ్లి రావటానికి దారి ఏర్పడుతుంది. ఈ గోల్డెన్ డిస్క్ ఆకాశంలోంచి వచ్చిందని మరో కథనం ప్రచారంలో ఉంది. ఆర్కియాలజిస్టులు ఎగ్జామిన్ చేసినప్పుడు డోర్వేలో సర్క్యులర్ డిస్క్ ఆకారం కనిపించింది. ఇదంతా చూస్తే, వింటే రబ్బిష్ అని అనిపిస్తుంది. కానీ, దీని వెనుక ఎక్స్ట్రా టెరెస్ట్రియల్ పవర్స్ బయటపడ్డాయి. ఈ విషయాన్ని శాస్త్రవేత్తలే ఒప్పుకుంటున్నారు.. మామూలు మనుషులకే దీని పవర్ ఏమిటన్నది అనుభవంలోకి వచ్చింది. ఇతర గ్రహాల నుంచి వచ్చిన ఇద్దరు స్పేస్ బ్రదర్స్, దీన్ని యాక్టివేట్ చేసినట్లు చెప్పుకుంటారు. గేట్ ఆఫ్ గాడ్ ఒక్కసారి యాక్టివేట్ అవుతే.. విశ్వంలో ఒక చివరి నుంచి మరో చివరకు వెళ్లే అవకాశాలు ఉన్నాయని అంటారు. గ్రహాంతరవాసులు యుఎఫ్తాల్లో లేక్ టిటికాకా సమీపంలో దిగినట్లుగా చెప్తారు. ఇప్పుడు ఈ ఎక్స్ట్రా టెరెస్ట్రియల్ పవర్స్ గురించి సైంటిస్టులు పాజిటివ్గా ప్రయోగాలు చేస్తున్నారు.. గ్రహాంతర వాసులు ఉన్నారనటానికి ఇదీ ఒక ఉదాహరణ అని వాళ్లు ఒక కంక్లూజనక్కు ఇప్పటికే వచ్చేశారు. ఇది దేవుడి డోర్వే కావటానికి కారణం బెర్ముడా ట్రయాంగిల్లో లో వున్న మాగ్నటిక్ పవర్ ఇక్కడ కూడా కనిపించటమే. సైంటిఫిక్గా ప్రూవ్ అయిన విషయమే ఇది. దీని దగ్గరకు వెళ్లగానే ఇందులోని కీహోల్ను తగలగానే మాగ్నెటిక్ పవర్ మనిషిని తనలోకి లాక్కొనేందుకు ప్రయత్నిస్తోంది. ఈ పవర్ సామర్థ్యం కానీ, దీని వెనుక ఉన్న సీక్రెట్ను కనుక్కోవటం ఇప్పటికైతే ఎవరి తరం కాలేదు. ప్రపంచంలో మిస్టీరియస్గా మిగిలిపోయిన ప్రాంతాల్లో ఇదీ ఒకటి. దీని ఆనుపానులేమిటన్నది దేవుడికి మాత్రమే తెలుసు... అందుకే ఇది దేవుడి తలుపు అయింది.. ఇది తెరుచుకుంటే ఆ లోపల ఉన్నది దేవుడి ఇల్లు.. లేకుంటే.. ఒక చారిత్రక ఆనవాలు.

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.